
ఈనాడు ప్రకాశం
మంగళవారం 22 అక్టోబరు 2024 5

వనంలో రాజసం



అడవికి రాజు పెద్దపులి. నల్లమలలో ఆ వన్యప్రాణి రాజసాన్ని చూసేందుకు పర్యాటకులు పరితపిస్తుంటారు. ఎక్కడెక్కడి నుంచో వస్తుంటారు. వరుసగా వర్షాలు కురుస్తుండటంతో ఈ నెల 13 నుంచి 18 వరకు జంగిల్ సఫారీని నిలిపివేశారు. ఈ నెల 19న పునః ప్రారంభించారు. దీంతో మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌కు చెందిన పర్యాటకులు జీప్సీలో వెళ్తుండగా జంగిల్ సఫారీలోని వ్యూపాయింట్ సమీపంలో పులి సంచరిస్తూ కనిపించింది. అడవిలో అయిదు రోజుల పాటు ఎలాంటి అలజడి లేకపోవడంతో పెద్దపులి స్వేచ్ఛగా సంచరించినట్లు గైడ్ రూబెన్ తెలిపారు.

– న్యూస్‌టుడే, పెద్దదోర్నాల



ట్రాలీలపై యుద్ధ ట్యాంకుల పయనం

చూడగానే శత్రువు వెన్నులో వణుకు పుట్టించే యుద్ధ ట్యాంకులవి. రాజసం ఉట్టిపడే ఈ ట్యాంకులు చెన్నై నుంచి ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ సైనిక కేంద్రానికి వెళుతున్నాయి. ట్యాంకులున్న రెండు ట్రాలీలను సోమవారం సింగరాయకొండలో జాతీయ రహదారి పక్కన కొంతసేపు నిలిపినప్పుడు క్లిక్‌మనిపించిన చిత్రమిది. –ఈనాడు, ఒంగోలు

ఎడతెగని వాన.. కన్నీటనే రైతన్న

- పెరుగుతున్న పంట నష్టాలు
- త్వరలో అంచనాకు ఏర్పాట్లు
- గ్రామ సభలు.. నివేదికలు



బూజు పట్టి నల్లగా మారిన కంకి



తాళ్లూరు మండలం రామభద్రాపురంలో దెబ్బతిన్న జొన్న తోట

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే:

జిల్లాను గత కొద్దిరోజులుగా వరుణుడు వీడటం లేదు. ప్రతిరోజూ ఏదో ఒక సమయంలో పలకరిస్తూనే ఉన్నాడు. కర్షకులకు కన్నీరు' మిగిలిస్తున్నాడు. పొలాల్లో నిలిచిన నీటిని తొలగించుకునేందుకు వీల్లేక పంటలు ఇప్పటికే ఉరకెత్తుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మరో అల్పపీడనం పొంచి ఉందనే సమాచారం రైతులను మరింత కలవరపాటుకు గురిచేస్తోంది. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు చేతికందకుండా పోతుండటంతో రైతులు కళ్ల నీళ్ల పర్యంతమవుతున్నారు. వరుస వర్షాలతో జిల్లాలో అత్యధికంగా సజ్జ, వరి, మొక్కజొన్న, పత్తి పంటలు ఇప్పటికే దెబ్బతిన్నాయి. సజ్జ, మొక్కజొన్న కంకులకు పొలాల్లోనే మొలకలొచ్చాయి. పొగాకు మడ్డి కారిపోగా, పత్తి కాయలు కుళ్లిపోతున్నాయి. సోమవారం నాటి సమాచారం ప్రకారం దెబ్బతిన్న పంటల విస్తీర్ణం 8,409 హెక్టార్లకు చేరింది. మొత్తం 205 గ్రామాల్లో 7,672 మంది రైతులు నష్టపోయారు. ఉద్యాన శాఖ పరిధిలోని మిర్చి, కూరగాయలు, పండ్ల మొక్కలు మొత్తం 1,198 హెక్టార్లలో ఇప్పటికే దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు.



దర్శి మండలం బసిరెడ్డిపల్లిలో పనికి రాకుండా పోయిన పత్తి

నేటి నుంచి సన్నాహాలు...: రైతులకు సత్వర సాయం అందించాలనే లక్ష్యంలో ప్రభుత్వం పంట నష్టం అంచనాకు షెడ్యూల్ ప్రకటించింది. ఈ మేరకు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో కలెక్టర్ ఆమోదం మేరకు మంగళవారం నుంచి రైత్వారీగా నష్టం అంచనాలు వేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకుగాను రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బందితో బృందాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 27వ తేదీలోపు నష్టం అంచనాలు పూర్తి చేసి గ్రామ సభల్లో పేర్లు ప్రకటిస్తారు. అభ్యంతరాలుంటే సరిచేస్తారు. అనంతరం కలెక్టర్‌కు నివేదిక అందజేసి ఆమోదం అనంతరం ప్రభుత్వానికి పంపుతారు. ఈ మొత్తం ప్రక్రియ నవంబర్ నాలుగో తేదీలోపు పూర్తికానుంది.


పంట	నష్టపోయిన విస్తీర్ణం	బాధిత రైతులు
మిర్చి	1,080	1,710
కూరగాయలు	86	98
అరటి	16	11
బొప్పాయి	15	17
సజ్జ	1,853	1,642
మినుము	1,379	1,245
జొన్న	03	02
అలసంద	1,683	1,587
పత్తి	2,627	2,489
వరి	120	98
కొర్ర	18	11
పొగాకు	695	598

పల్లెల్లో పనుల పండగ

- నాడు ప్ర'గతి' తప్పి.. నేడు పట్టాలెక్కి
- 437 పంచాయతీల్లో 1,140 శంకుస్థాపనలు

కొత్తపట్నం, న్యూస్‌టుడే:

వైకాపా నిర్వాకంతో గత అయిదేళ్లుగా పల్లెల్లో అభివృద్ధి నిలిచిపోయింది. పాలన గతి తప్పి ఎలాంటి ప్రగతి లేకపోయింది. ఈ నేపథ్యంలో ఇటీవల కొలువుదీరిన కూటమి ప్రభుత్వం సమస్యల పరిష్కారంపై దృష్టిసారించింది. పనులకు శ్రీకారం చుట్టింది. 'పల్లె పండగ' పేరుతో గ్రామాల్లో ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు ఊరూరా శంకుస్థాపనలు చేసింది. వీటిలో సిమెంట్ రోడ్లతో పాటు, గోకులాలు, ఉద్యాన సాగు కింద పండ్ల తోటల పెంపకం వంటి పనులున్నాయి. తొలుత ఆగస్టు 23న 729 గ్రామ సభలు నిర్వహించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల లభ్యత ఆధారంగా తొలి విడతగా ప్రాధాన్యతా క్రమంలో జిల్లా వ్యాప్తంగా సిమెంట్ రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. ఈ పనులు చేపట్టేందుకు కొన్ని గ్రామాలను ఎంపిక చేశారు. అనంతరం నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



ఈ నెల 14 నుంచి శంకుస్థాపన చేసిన పనులిలా...

నియోజకవర్గం	మొత్తం పనులు	నిధులు (రూ.కోట్లలో)
దర్శి	204	15.00
సంతనూతలపాడు	99	15.55
ఒంగోలు	366	15.98
కనిగిరి	62	15.00
కొండపి	90	17.16
మార్కాపురం	75	12.40
గిద్దలూరు	108	15.00
యర్రగొండపాలెం	136	15.00

ఆ మండలాల్లో కాలువలు...: అన్ని నియోజకవర్గాల్లో సిమెంట్ రహదారులకు నిధులు కేటాయించారు. వీటితో పాటు ఎస్ఎన్‌పాడు నియోజకవర్గంలోని సంతనూతలపాడు, నాగులుప్పలపాడు, మద్దిపాడు మండలాల్లో(30); మార్కాపురం నియోజకవర్గంలోని తర్లుపాడు మండలానికి(07) మురుగు కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. మొత్తం 37 పనులకు సంబంధించి 16.91 కి.మీ మేర కాలువ నిర్మాణానికి అంచనా వేయగా, అందుకు రూ.7 కోట్ల వరకు నిధులు మంజూరయ్యాయి. ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్యల కారణంగా ఈ పనుల శంకుస్థాపనను తాత్కాలికంగా వాయిదా వేశారు.

*** జనవరి చివరికి పూర్తయ్యేలా ప్రణాళికలు...:** 'పల్లె పండగ' వారోత్సవాల్లో భాగంగా శంకుస్థాపన చేసిన పనులను ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ నిధుల కింద చేపట్టనున్నారు. జిల్లాలోని 437 గ్రామ పంచాయతీల్లో 1,140 సీసీ రోడ్లు నిర్మించనున్నారు. వీటి నిర్మాణం నిమిత్తం రూ.121.09 కోట్ల నిధులు మంజూరయ్యాయి. జనవరి నెలాఖరుకల్లా పూర్తి చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

త్యాగాలు చిరస్మరణీయం..
తల్లిదండ్రులకు పాదాభివందనం

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: దేశ అంతర్గత భద్రత, శాంతిభద్రతల నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివనీ., ఆ బిడ్డలను కన్న తల్లిదండ్రులకు పాదాభివందనం చేస్తున్నానని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ సభను ఒంగోలు పోలీసు కవాతు మైదానంలో సోమవారం నిర్వహించారు. మంత్రి స్వామి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల మాన, ధన, ప్రాణరక్షణకు పోలీసులు తమ ప్రాణాలను పణంగా పెట్టి పని చేస్తున్నారని తెలిపారు. తొలుత జిల్లా ఎస్పీ ఏఆర్.దామోదర్ ఆధ్వర్యంలో సాగిన ఈ కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు మాట్లాడారు. గత ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అధికారులు, సిబ్బంది పేర్లు చదివి వినిపించారు. అనంతరం మంత్రి బాలవీరాంజనేయస్వామి, జిల్లా ప్రధాన జడ్జి కె.భారతి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్, మూడో అదనపు జిల్లా జడ్జి డి.రాములు, 7వ అదనపు జిల్లా జడ్జి రాజా వెంకటాద్రి, 8వ అదనపు జిల్లా జడ్జి డి.అమన్‌రాజా, డీఎస్‌పీ కార్యదర్శి శ్యామ్‌బాబు, మేయర్ గంగాడ సుజాత, రాష్ట్ర 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ తదితరులు అమర వీరుల స్మారక స్మృతి స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు.

బరువెక్కిన హృదయాలు...: సంస్మరణ కార్యక్రమం సందర్భంగా పోలీసు మైదానంలో ఉద్విగ్న వాతావరణం నెలకొంది. తొలుత పోలీసులు తుపాకులు దించి తమ సహచరులకు బరువైన హృదయాలతో నివాళి అర్పించారు. జిల్లాకు చెందిన పలువురు అమరవీరుల కుటుంబీకులు స్మృతి స్తూపంపై పూలుజల్లి తమ వారి త్యాగాలను స్మరించుకున్నారు.







స్తూపం వద్ద శద్ధాంజలి ఘటిస్తున్న పోలీసు బలగాలు.. మంత్రి స్వామి, జిల్లా ప్రధాన జడ్జి భారతి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్, మేయర్ సుజాత, దినకర్ తదితరులు

సమష్టి కృషితో ప్రజలకు వైద్య పథకాల చేరువ

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు ప్రతి ఒక్కరికీ చేరువ చేసేందుకు సమష్టిగా పనిచేయాల్సి ఉంటుందని వైద్య ఆరోగ్య శాఖ కేంద్ర బృందం పరిశీలకుడు డాక్టర్ వరుణ్ విజయ్ అన్నారు. జిల్లాలోని ఆసుపత్రుల పరిశీలన అనంతరం జిల్లా కార్యాలయంలో ప్రోగ్రాం అధికారులతో ఒంగోలులో ఆయన సోమవారం సమావేశమయ్యారు. అంతకుముందు మాతా శిశు సంరక్షణ, జననీ శిశు సురక్ష యోజన, అయిదేళ్లలోపు పిల్లలకు అందుతున్న వైద్యసేవలను బృందం సభ్యులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జీజీహెచ్, ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక, సామాజిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. పథకాలపై అవగాహనను పరీక్షించారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్ కుమార్ అధ్యక్షతన అధికారులతో సమావేశమయ్యారు.

డీఎల్‌డీవో భర్త ఖాతాకు

బదిలీ సొమ్ము

- కలెక్టర్ ఆదేశాలూ కాదని ఉత్తర్వులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో ఇటీవల చేపట్టిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ గ్రేడ్-5, 6 కార్యదర్శుల బదిలీలు వివాదాస్పదంగా మారాయి. అక్రమాలు చోటుచేసుకున్నాయని, నగదు వసూలు చేశారంటూ విమర్శలు వచ్చాయి. ఆ మేరకు డీపీవో కార్యాలయ పూర్వ ఏవో శివప్రసాద్, జూనియర్ సహాయకుడు కిషోర్, డిజిటల్ సహాయకుడు సాయి కోటేశ్వరరావును ఉన్నతాధికారులు ఇప్పటికే సస్పెండ్ చేశారు. వారిపై ఒంగోలు రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లోనూ క్రిమినల్ కేసు నమోదు చేయించారు. పూర్వ డీపీవో, ప్రస్తుత ఒంగోలు డీఎల్‌డీవో ఉషారాణిపై కూడా ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో పూర్తిస్థాయి విచారణకు ఎస్‌డీసీ లోకేశ్వరరావు ఆధ్వర్యంలో త్రిసభ్య కమిటీని నియమించారు. ఈ మేరకు సోమవారం విచారణ చేపట్టారు.



వెలుగులోకి విషయాలు...: పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియకు సంబంధించి కలెక్టర్ తమీమ్ అన్సారియా వద్ద ముందుగా అనుమతులు తీసుకున్నారు. ఆ సమయంలో గ్రేడ్-6(డిజిటల్ సహాయకులు) 40 మంది, గ్రేడ్-5 కార్యదర్శులు మరో 8 మందిని యథావిధి స్థానాల్లోనే కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. అధికారులు మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారు. బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంపై డీఎల్‌డీవో ఉషారాణిని విచారణ అధికారులు ప్రశ్నించారు. ఎమ్మెల్యేల నుంచి వచ్చిన సిఫార్సుల మేరకు చేయాల్సి వచ్చిందని వివరణ ఇచ్చినట్లు తెలిసింది. బదిలీ నిమిత్తం డీఎల్‌డీవో ఉషారాణి భర్త బ్యాంక్ ఖాతాకు ఓ ఉద్యోగి నగదు జమ చేసినట్లు విచారణలో గుర్తించారు. సచివాలయాల సందర్శనకు వచ్చిన సమయంలో ఉద్యోగుల నుంచి నగదు వసూళ్ల పైనా ఆరా తీశారు. మంగళవారం కూడా విచారణ ప్రక్రియ కొనసాగనుంది.

అడవిలో అలజడి

- నల్లమలలో ఉచ్చులు, వలలు
- బలవుతున్న వన్యప్రాణులు
- యథేచ్ఛగా వేటగాళ్ల ఆగడాలు





నల్లమల అడవులు అరుదైన జంతు, వృక్ష జాతులకు నెలవు.. జీవవైవిధ్యానికి పుట్టినిల్లు. సువిశాలమై ఈ ప్రాంతం వన్య ప్రాణులకు ఎంతో భద్రమైనదిగా పేరొందింది. అటువంటి అడవిలో ఇప్పుడు అలజడి రేగుతోంది. ఇక్కడి జీవజాలంపై వేటగాళ్ల కళ్లు పడ్డాయి. ఉచ్చులు అమర్చుతూ.. వలలు ఏర్పాటు చేస్తూ యథేచ్ఛగా వేట సాగిస్తున్నారు. పెద్ద పులులు మొదలు అడవి కోళ్ల వరకు ప్రాణుల ఉసురు తీస్తున్నారు. నల్లమలలో జీవించే పులులు, చిరుతలు, కృష్ణ జింకలు, దుప్పులు, నక్కలు, అడవి కుక్కలు, కుందేళ్లు, అడవి కోళ్లు, మనుబోతులు, ఎలుగుబంట్లను మట్టుబెడుతున్నారు.

అంతరించి పోతున్న జాతుల్లో ఒకటైన అలుగు(పంగోలిన్)నూ వదలటం లేదు. ఈ సాధు జంతువు వేటగాళ్ల ఆగడాలతో ఇప్పుడు విలవిల్లాడుతోంది. మార్కాపురం అటవీ డివిజన్ పరిధిలో గత అయిదేళ్ల కాలంలో అలుగు అక్రమ రవాణాపై అయిదుకు పైగా కేసులు నమోదు కావడం పరిస్థితి తీవ్రతను చెప్పకనే చెబుతోంది.

దొరికితే జైలు.. జరిమానా...: అడవి జంతువులను పెంచుకోవడం, వేటాడటం పూర్తిగా నిషేధం, అడవిలో, మన పరిసరాల్లోనూ వాటిని మచ్చిక చేసుకోవడంతో పాటు మాంసం కలిగి ఉండటం నేరమని వన్య ప్రాణుల సంరక్షణ చట్టం 1972 చెబుతోంది. ఈ చట్టంలోనూ ఇటీవల కొన్ని మార్పులు చేశారు. నిందితులకు ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా విధించవచ్చు. ఈ రెండింటినీ ఏకకాలంలోనూ అమలు చేయొచ్చని అధికారులు చెబుతున్నారు. అంతరించిపోతున్న వన్యప్రాణుల రక్షణ అందరి కర్తవ్యం. గ్రామ పరిసరాల్లోకి అడవి జంతువులు వస్తే వాటికి హాని తలపెట్టకుండా అధికారులకు తెలియజేయాల్సి ఉంటుంది. అడవులు, పొలాల్లో వేటకు విద్యుత్తు తీగలు ఏర్పాటు చేయడం, ఉచ్చులు, వలలు అమర్చడం కూడా చట్టరీత్యా నేరం. ఈ విషయమై మార్కాపురం అటవీ క్షేత్రాధికారి వరప్రసాద్ మాట్లాడుతూ.. జంతువులను వేటాడాలనుకునే వారికి చట్టం ఓ హెచ్చరిక వంటిదన్నారు. అంతరించిపోతున్న పంగోలియన్ వంటి జంతువులను సంరక్షించాలని కోరారు.

బుల్లెట్ దిగని శరీరం.. అక్రమార్కులకు అదే వరం...



పెద్దపులి. ఎంతటి బలమైన జంతువునైనా వేటాడి తింటుంది. అలుగు(పంగోలిన్)ను మాత్రం చంపలేదు.. తినలేదు. చిన్న అలికిడి వినిపించినా బంతి ఆకారంలో ముడుచుకుని పోయే క్షీర జాతికి చెందిన జీవి అలుగు. చీమలు, చెదపురుగులు తిని జీవిస్తుంది. తుపాకీతో కాల్చినా బుల్లెట్ లోపలికి దిగనంత కఠినంగా ఉండే శరీర నిర్మాణం దీని ప్రత్యేకత. ఇటువంటి జీవి వేటగాళ్లకు మాత్రం సులభంగా దొరికిపోతుంది. తన శరీరాన్ని బంతిగా మలచుకుని కదలకుండా ఉండిపోతుంది. ఈ క్రమంలో వేటగాళ్లకు దొరికిపోతుంది.



గత అయిదేళ్లలో మార్కాపురం డివిజన్ పరిధిలో నమోదైన కేసులు

రేంజ్	నమోదైన కేసులు	నిందితులు
మార్కాపురం	09	19
దోర్నాల	10	20
యర్రగొండపాలెం	03	13
జి.వి.పల్లి	01	0
కొర్రపోలు	02	05
విజయపురి సౌత్	02	04

చైనా, వియత్నాంలకు అక్రమ రవాణా...: చైనా, వియత్నాం దేశాల్లో అలుగుకు డిమాండ్ ఎక్కువ. ఈ జంతువు చర్మం, పొలుసులు, మాంసంలో ఔషధ గుణాలున్నాయని నమ్ముతారు. ఖరీదైన వస్త్రాలు, ఆభరణాల్లోనూ వాడతారు. ఇదే అదునుగా వేటగాళ్లు అలుగును అక్రమంగా రవాణా చేసేందుకు ప్రయత్నిస్తూ అటవీ అధికారులకు చిక్కుతున్నారు.

న్యూస్‌టుడే: మార్కాపురం, పెద్దదోర్నాల

గతమంతా ఏకపక్షం..

నిధుల్లేక నీరసం

- నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మండల, జడ్పీ పాలకవర్గాలకు ఇప్పటికే మూడేళ్లు పూర్తయ్యాయి. పదవీ కాలం మరో రెండేళ్లలోపే ఉంది. జడ్పీటీసీ సభ్యులందరూ వైకాపాకు చెందినవారే కావడంతో మూడేళ్లుగా జడ్పీ సర్వసభ్య సమావేశాలు ఏకపక్షంగా కొనసాగాయి. కానీ అభివృద్ధి పరంగా ఎలాంటి నిధులూ సాధించింది లేదు. గత వైకాపా ప్రభుత్వం గ్రామ పంచాయతీలతో పాటు, స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసింది. పాలకులను ఉత్సవ విగ్రహాలుగా మార్చింది. జడ్పీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్తగా నిర్మించేందుకూ నిధులివ్వలేదు. ప్రత్యామ్నాయంగా డీపీఆర్సీ భవనంలో అసంపూర్తి పనులను పూర్తి చేసుకుని కార్యాలయాన్ని అందులోకి తరలించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పది మంది ఎమ్మెల్యేలు కూటమి నుంచి గెలుపొందారు. వైకాపాకు చెందిన కొందరు జడ్పీటీసీ సభ్యులు 2024 సార్వత్రిక ఎన్నికల నుంచే తెదేపా వెంట నడుస్తున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వంలోనైనా నూతన జడ్పీ భవన నిర్మాణంతో పాటు, పల్లెల్లో కీలకమైన తాగునీరు, పంచాయతీరాజ్ శాఖ రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాల్సి ఉంది.

ఎనిమిది శాఖలపై సమీక్ష...: ఒంగోలులోని పాత జడ్పీ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా డ్వామా, డీఆర్డీఏ, గృహ నిర్మాణం, విద్య, విద్యుత్తు, వైద్య, ఆరోగ్య; గ్రామీణ నీటి సరఫరా విభాగం, పంచాయతీరాజ్ శాఖ కార్యకలాపాలపై సమీక్షించనున్నారు.

రైతేరాజు 6లో..
అధిక వర్షాలు.. అప్రమత్తత అవసరం

సాగుకు ఊతం.. ఎన్నికలకు సమాయత్తం

- తొమ్మిదేళ్ల తర్వాత మోగిన నగారా
- జాబితాల తయారీకి యంత్రాంగం కసరత్తు



సంతనూతలపాడు వద్ద సాగర్ కాలువ

సాగు నీటి వినియోగదారుల సంఘాల్లో(డబ్ల్యూయూఏ) రైతులే సభ్యులుగా ఉంటారు. వీరు కనీస బాధ్యతగా జల వనరుల నిర్వహణ పనులు చేయించేవారు. గత వైకాపా సర్కారు వీటిని అంతగా పట్టించుకోలేదు. ఫలితంగా కాలువలు, తూములు, అలుగులు అధ్వానంగా తయారయ్యాయి. మరమ్మతులు చేపట్టకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెదేపా గతంలో అధికారంలో ఉన్నప్పుడు 2015లో ఎన్నికలు నిర్వహించారు. 2019 వరకు ఆ కార్యవర్గాలు కొనసాగాయి. పదవీ కాలం పూర్తయిన తర్వాత వైకాపా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా పదవులను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చింది. దీంతో జల వనరుల నిర్వహణ గాడి తప్పింది. తొమ్మిదేళ్ల తర్వాత ఆ సంఘాలకు ఊపిరులూదేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా ఎన్నికల నిర్వహణకు తెర లేపింది. ఇందుకు సంబంధించిన ప్రకటన సోమవారం విడుదల చేసింది. నవంబర్ 24 నుంచి 26వ తేదీ మధ్య ఈ ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించింది. ఆ మేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియాను జల వనరుల శాఖ ఎస్ఈ వరలక్ష్మి కలిసి ఎన్నికల విషయం వివరించారు.

– న్యూస్‌టుడే, ఒంగోలు నగరం, పామూరు

మొత్తం మండలాలు: **38**

సాగునీటి సంఘాలు: **342** (మైనర్: 240, మీడియం: 14, మేజర్: 88)

మొత్తం ఓటర్లు: **1.10 లక్షల** మంది

సంఘాల స్వరూపం ఇలా...

జిల్లాలో మొత్తం 342 నీటి వినియోగదారుల సంఘాలున్నాయి. ఒక్కో సంఘం పరిధిలో 12 మంది సభ్యులను రైతులు తొలుత ఎన్నుకుంటారు. అనంతరం వారు తమలో ఒకరిని అధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. జిల్లాలోని పది డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, మూడు ప్రాజెక్టు కమిటీలకూ ఎన్నికలు నిర్వహిస్తారు. వినియోగదారుల సంఘాల అధ్యక్షులంతా కలసి డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకుంటారు. ప్రాజెక్టు కమిటీలు జిల్లాలో లేవు. గుంటూరు పరిధిలో ఉన్నాయి. మీడియం ఇరిగేషన్ కింద గల మోపాడు, కంభం, పాలేరు బిట్రగుంట ఆయకట్టు పరిధిలో కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

మొత్తం 1.10 లక్షల మంది ఓటర్లు...

సాగు నీటి సంఘాల్లో మొత్తం 1.10 లక్షల మంది రైతులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. 2015 తర్వాత ఎన్నికలు నిర్వహిస్తున్నందున ఓటర్ల జాబితాలను నవీకరించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సాగు భూమి ఎవరి పేరుతో ఉంది. ఎవరు ఏ కమిటీ పరిధిలో ఉన్నారనేది పరిశీలించనున్నారు. ఈ విషయమై ఎస్ఈ వరలక్ష్మి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయి నుంచి సమాచారం తీసుకొని ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం ప్రక్రియ 40 రోజుల్లో పూర్తి చేయనున్నట్లు చెప్పారు.


ఆయకట్టు వివరాలు ఇలా..	ఎన్నెస్పీ: 2.50 లక్షలు ఎకరాలు	మైనర్ ఇరిగేషన్: లక్ష ఎకరాలు మీడియం ఇరిగేషన్: 15 వేల ఎకరాలు	గతంలో ఎన్నికలు నిర్వహించింది: 2015	ప్రస్తుతం తేదీలు:	నవంబరు 21-23(మైనర్)	నవంబర్ 24-26(మేజర్)	నవంబర్ 27-29 (ప్రాజెక్టు కమిటీలు)

మేఘాలతో ఇంద్రచాపం దోబూచులాడె..



గతానికి భిన్నంగా వరుణుడు నిత్యం పలకరిస్తున్నాడు. వాన వెలియగానే ఇంద్రచాపాలు సాక్షాత్కరిస్తున్నాయి. గిరులను తాకుతూ..మేఘాలను మీటుతూ రంగురంగుల హరివిల్లులు కనువిందు చేస్తున్నాయి. కంభం నుంచి అర్ధవీడు వెళ్లే దారిలోని అయ్యవారిపల్లె కొండ ప్రాంతంలో సోమవారం భారీ ఇంద్రధనస్సు చూపరులను ఆకట్టుకుంది. –న్యూస్‌టుడే, కంభం

ఒంగోలుకు రైలు హోటల్ కదిలొచ్చే..



ఒంగోలు రైల్వే స్టేషన్ వద్దకు లారీలో ఓ పాత బోగీ తీసుకొచ్చారు. విజయవాడ తదితర ప్రాంతాల్లో ఇప్పటికే బోగీ రెస్టారెంట్లు ఉన్నాయి. అలాంటి అనుభూతి ఒంగోలువాసులకు చేరువ చెయ్యడంలో భాగంగా ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. -ఈనాడు, ఒంగోలు

బాధ్యతతో పనిచేస్తే ఉత్తమ ఫలితాలు

తాళ్లూరు, న్యూస్‌టుడే : ఉపాధ్యాయులందరూ బాధ్యతగా పనిచేయాలని డీఈవో సామా సుబ్బారావు సూచించారు. తాళ్లూరులోని వీకే ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ముందుగా పాఠశాల పరిసరాలు, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో దస్త్రాలు తనిఖీ చేశారు. వాటి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. తదుపరి ఉపాధ్యాయులు, సిబ్బందితో సమావేశమయ్యారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు అర్థమయ్యేలా బోధించాలన్నారు. సబ్జెక్టుల వారీగా వారి పురోగతిని ఎప్పటికప్పుడు అంచనా వేయాలన్నారు. విద్యాపరంగా వెనుకబడిన వారిని గుర్తించి వారిపై మరింత శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎంఈవో ఎల్.సుధాకరరావు, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా జైలులో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా జడ్జి ఎ.భారతి

పేదలకు ఉచితంగా న్యాయ సహాయం

ఒంగోలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: క్షణికావేశంలో తప్పులు చేసి జైలు పాలైతే విలువైన జీవితం కోల్పోవడమే కాక తమవారికి తలవంపులు తెచ్చినట్లవుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి అభిప్రాయపడ్డారు. సోమవారం ఆమె జిల్లా జైలును సందర్శించారు. అక్కడి ఖైదీలకు అందుతున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. వారికి చట్ట ప్రకారం అందిస్తున్న సదుపాయాల గురించి ఆరా తీశారు. కారాగారంలోని ఖైదీలతో ముఖాముఖి మాట్లాడారు. న్యాయవాదిని నియమించుకోలేని పేదలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.శ్యాంబాబు, జైలు అధికారులు వి. రమేష్, ఎం.శ్రీనివాసరావు, జైలు వైద్యుడు బ్రహ్మతేజ, జైలుసిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా అంతర్ కళాశాలల పోటీలు



అంతర కళాశాల పోటీలు ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న దేవీవరప్రసాద్

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని ఆంధ్రకేసరి విశ్వ విద్యాలయం ప్రిన్సిపల్ రాజమోహన్‌రావు అన్నారు. సోమవారం ఉమ్మడి ప్రకాశంలోని డిగ్రీ విద్యార్థుల అంతర కళాశాలల పోటీలు ప్రారంభమయ్యాయి. వేటపాలెం బండ్ల బాపయ్య కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించాలన్నారు. డిప్యూటీ డైరెక్టర్ ఐ.దేవీవరప్రసాద్ మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఆ కోటా కింద ప్రవేశాలు లభిస్తాయన్నారు. ఇవి దేహ దారుఢ్యానికి ఉపయోగపడతాయన్నారు. బీబీహెచ్ ప్రిన్సిపల్ ఆదిలక్ష్మి పాల్గొన్నారు. మొత్తం 224 కళాశాలలుండగా సోమవారం బ్యాడ్మింటన్, షటిల్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. 30 కళాశాలల నుంచి 32 టీములు పాల్గొన్నాయి.

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల గడువు పొడిగింపు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి డీఎస్సీ ఉచిత శిక్షణ నిమిత్తం జ్ఞానభూమి వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 25వ తేది వరకు గడువు పొడిగించినట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి లక్ష్మానాయక్ తెలిపారు. డీఎస్సీ శిక్షణకు దరఖాస్తు చేసుకున్న వారికి మూడు నెలలపాటు ఉచిత శిక్షణ, భోజనం, వసతి సదుపాయం కల్పించనున్నట్లు ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అరటి తోట... లాభాల బాట



న్యూస్‌టుడే – ఒంగోలు కర్నూలు రోడ్డు

ఏళ్లుగా పసుపు సాగు చేస్తూ, పంట మార్పిడి చేస్తే బాగుంటుందన్న ఆలోచనతో అరటి తోట వేసి మంచి ఫలితాలు సాధిస్తున్నారు... కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామానికి చెందిన రైతు దాసరి గోపాలరెడ్డి. మొత్తం పది ఎకరాల్లో గత మూడేళ్లుగా అమృతపాణి రకం సాగు చేస్తున్నారు. పూర్తిగా సేంద్రియ పద్ధతులే అవలంబిస్తున్నారు.



ఓసారి నాటితే చాలు...: ముందుగా పొలాన్ని అరటి పిలకలు నాటేందుకు వీలుగా దుక్కులు దున్ని సిద్ధం చేశారు. కోనసీమ ప్రాంతం నుంచి ఒక్కోటి రూ.పది చొప్పున మొక్కలు తెచ్చారు. ఎకరాకు 12 వందల మేర నాటారు. వారానికి ఓసారి చొప్పున నీటి తడులు అందించారు. పోషక లోపం తలెత్తకుండా జీవామృతంతో పాటు... ఎప్పటికప్పుడు మొక్కల మొదళ్లలో పశువుల ఎరువు వేశారు. మూడు నెలలకు మొక్కలు కుదురుకుని... ఆరు నెలలకు గెలలు రావడం ప్రారంభమైంది. తొమ్మిది నెలలకు పూర్తిస్థాయిలో కోతకు వచ్చాయి. ఓసారి గెల కోశాక ఆ చెట్టును తొలగించాలి. అనుబంధంగా వచ్చే పిలకలే మళ్లీ మొక్కలుగా అభివృద్ధి చెందుతాయని రైతు తెలిపారు. అప్పటి నుంచి ఆరు నెలలకే ఫలసాయం చేతికి వస్తుందని వివరించారు. అలా మూడేళ్ల కాలంలో మొత్తం అయిదు సార్లు కోత కోసినట్లు చెప్పారు.

మంచి ఆదాయం...: తుపాన్లు, ఈదురుగాలులకు తోట ధ్వంసం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని... గెల బరువుకు చెట్టు విరిగిపోకుండా కర్రలను ఆధారంగా ఉంచాలని రైతు తెలిపారు. ఇప్పటి వరకు తెగుళ్ల సమస్య తలెత్తలేదని చెప్పారు. సీజన్‌ను బట్టి మార్కెట్‌లో ఒక్కో గెలకు రూ.మూడు వందల నుంచి రూ.నాలుగు వందల వరకు ధర లభిస్తోందన్నారు. అన్ని ఖర్చులు పోనూ మంచి ఆదాయమే మిగులుతోందని వివరించారు. నీటి వసతి ఉన్నవారు అరటి తోటలు సాగు చేయవచ్చని తన అనుభవంతో చెప్పారు.

రైతేరాజు

అధిక వర్షాలు.. అప్రమత్తత అవసరం

గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఉద్యాన పంటల్లో నీరు నిలిచి సమస్య నెలకొంది. ఈ తరుణంలో కొద్దిపాటి జాగ్రత్తలు పాటించడం ద్వారా ఆయా పంటలను రక్షించుకోవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్ తెలిపారు.



దెబ్బతిన్న మిరప పైరును పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారిణి

మిరప: ఉరకెత్తిన పొలాల్లో మొక్కలు తేరుకునేందుకు లీటరు నీటికి పది గ్రాములు చొప్పున యూరియా, పంచదార కలిపిన ద్రావణాన్ని వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. మొక్కలు వడబడి, తలలు వాల్చితే లీటరు నీటికి అయిదు గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని చల్లాలి.

◗ కాపుతో ఉండి, వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి... మొదళ్ల చుట్టూ మట్టిని ఎగదోయాలి. నేల ఆరిన వెంటనే గొర్రువేసి అంతర కృషి చేస్తే తడి ఆరిపోతుంది. పైపాటుగా ఎకరానికి 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్, 200 కిలోల వేప పిండి వేయాలి. మొక్కలు తేరుకున్నాక స్థూల, సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని ఒక దాని తర్వాత ఒకటి వారం రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడు సార్లు వేయాలి.

వేరుకుళ్లు ఆశిస్తే పది లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 10 గ్రాముల కార్బండిజమ్ కలిపి మొక్కల మొదళ్లలో పోయాలి.

కూరగాయలు: పడిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదళ్ల వద్ద మట్టిని ఎగదోయాలి. సరిపడా ఆకులు, కొమ్మలతో ఉంటే 0.3 శాతం 13-0-45 మందు (నీటిలో కరిగే ఎరువు మల్టీ-కె) లేదా రెండు శాతం యూరియా ద్రావణాన్ని... వారం రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడు సార్లు మొక్క తడిచేలా పిచికారీ చేయాలి. కొత్తగా విత్తిన లేదా నాటిన మొక్కలైతే పూర్తిగా తొలగించి మళ్లీ నాటుకోవాలి.

పూల తోటలు: మొక్కలపై 2 శాతం యూరియా లేదా 1 శాతం 13-0-45 (నీటిలో కరిగే ఎరువు మల్టీ-కె)ను వారం రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడు సార్లు పిచికారీ చేయాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు లీటరు నీటికి 1 మి.లీ. ప్రొపికొనజోల్ కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు వేయాలి. – న్యూస్‌టుడే, కంభం

పొగాకు నారుమళ్లు... జాగ్రత్తలు తప్పనిసరి



ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పొగాకు నారుమళ్లు సాగుచేసే రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పొదిలి వేలం కేంద్రం నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్ తెలిపారు. మడుల్లో నీరు నిల్వ లేకుండా బయటకు తోడించాలని సూచించారు. నారుమడిపై ఏర్పాటుచేసిన గ్రీన్‌టెక్‌లు తొలగించి గాలి తగిలేలా చూడాలి. అధిక వర్షపాతం, తేమ, మబ్బు వాతావరణం నేపథ్యంలో మాగుడు, మానుమచ్చ, ఆకుమచ్చ తెగుళ్లు, లద్దెపురుగు ఆశించే ఆస్కారముంది. 30 రోజుల్లోపు మళ్లలో తెగుళ్లు తీవ్రంగా ఉంటే... పది లీటర్ల నీటికి 20 గ్రాముల బైటాక్స్, ఒక గ్రాము ప్లాంటామైసిన్ కలిపి పిచికారీ చేయాలి. 30 రోజులు దాటిన మళ్లలో తెగుళ్ల నివారణకు... పది లీటర్ల నీటికి అయిదు మి.లీ. అజాక్సీస్ట్రోబిన్ (అమిస్టార్) కలిపి చల్లాలి. లద్దెపురుగు ఎక్కువగా ఉంటే... పది లీటర్ల నీటికి అయిదు గ్రాముల ఇమామెక్టిన్ బెంజోయేట్ కలిపి పిచికారీ చేయాలని వివరించారు. – న్యూస్‌టుడే, పొదిలి

సమస్య - పరిష్కారం

◗ **సమస్య:** కొద్ది రోజులుగా మా దూడ తెల్లగా పారుతోంది. నివారణ ఎలా?
– శ్రీను, బొందలపాడు

సమాధానం: మోతాదుకు మించి పాలు తాగిస్తే అజీర్తి చేసి సమస్య తలెత్తుతుంది. ఈ కొలై అనే క్రిమి కూడా కారణం కావచ్చు. పాల మోతాదు తగ్గించి... గోరువెచ్చని నీటిలో యాంటీబయాటిక్ పొడి కలిపి తాగించాలి. నీటిలో గ్లూకోజ్, ఉప్పు కలిపి ఇచ్చినా సరిపోతుంది. నట్టల నివారణ మందు తాగించాలి.

◗ **సమస్య:** మా మందలోని కొన్ని గొర్రెలు కుంటుతున్నాయి. ఏం చేయాలి?
– పాపయ్య, కొట్టాలపల్లె

సమాధానం: తడి ఎక్కువగా ఉన్న నేలల్లో నడిపించడం వల్ల గిట్టల మధ్య చర్మం తెల్లగా పాచి సమస్య తలెత్తవచ్చు. కొన్నిసార్లు పుండ్లు పడి చీము సైతం కారుతుంది. పది శాతం జింక్ సల్ఫేట్ లేదా కాపర్ సల్ఫేట్ లేదా ఫార్మాలిన్‌తో కాళ్లు కడగాలి. పశు వైద్యులను సంప్రదిస్తే తీవ్రతను బట్టి మందులు సూచిస్తారు.
– న్యూస్‌టుడే, మార్కాపురం



లీనాగ్రేస్, పశువైద్యురాలు, కొండేపల్లి

త్వరలో ఎన్టీఆర్ కళాపరిషత్ ఉత్సవాలు నిర్వహిస్తాం

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: ఒంగోలు నగరంలో గత అయిదేళ్లు రాజకీయ కారణాల రీత్యా ఎన్టీఆర్ కళాపరిషత్‌ను నిర్వహించకలేకపోయామని... అందుకు చింతిస్తున్నామని ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు పేర్కొన్నారు. స్థానిక కర్నూలు రోడ్డులోని మౌర్య హోటల్లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. కళా పరిషత్తు ఏర్పాటు చేసి పాతిక వసంతాలు పూర్తయిన సందర్భంగా వచ్చే ఏడాది జనవరి 18 నుంచి 31 వరకు ఎన్టీఆర్ కళా పరిషత్తు 25వ జాతీయ నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ నలుమూలల నుంచి అన్ని కళారూపాలకు ఆహ్వానం పలుకుతున్నామని.. కళాసంస్థలు నవంబర్ 30వ తేదీలోపు దరఖాస్తులు పంపాలని కోరారు. ఈ సంవత్సరం నుంచి వీడియో స్క్రూటినీ ద్వారానే నాటక కళారూపాలను ఎంపిక చేయనున్నట్లు వివరించారు. ఎంపికైన కళారూపాల సమాచారం ఆయా సంస్థలకు డిసెంబర్ 15 లోపు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ కార్యదర్శి అన్నమనేని ప్రసాదరావు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



మార్గదర్శక పత్రాలను విడుదల చేసిన సంస్థ అధ్యక్షుడు ఈదర హరిబాబు

దస్త్రాల్లో నమోదే పరిష్కారం కాదు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: 'మీ కోసం'లో వచ్చే అర్జీల పరిష్కారం పట్ల నిర్లక్ష్యం తగదని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను హెచ్చరించారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన 'మీ కోసం'లో 249 అర్జీలొచ్చాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మొక్కుబడి సమాధానాలతో అర్జీదారులకు ఎండార్స్‌మెంట్ ఇచ్చేసి సమస్యను పరిష్కరించినట్లు దస్త్రాల్లో చూపితే సహించబోమన్నారు. క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారం కావాల్సిందేనని, లేకుంటే అందుకు కారణాలను కూడా అర్జీదారులకు వివరించాలని సూచించారు. ప్రతి సోమవారం ఉదయం 9.55 గంటలకల్లా అధికారులందరూ హాజరుకావాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో శ్రీలత, ఎస్‌డీసీలు మాధురి, ఝాన్సీలక్ష్మి తోపాటు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఇబ్బందులు తెలుసుకుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

బాధితులకు సత్వర న్యాయం

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలపై సత్వరం స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి హాజరయ్యారు. ఇటీవల కాలంలో ఆన్‌లైన్, ఫ్రాంక్‌కాల్ మోసాలు పెరిగాయనీ, వాటిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 69 మంది తమ సమస్యలపై ఎస్పీకి వినతిపత్రాలు అందజేశారు. వీటిని చట్టపరిధికి లోబడి పరిష్కరిస్తామని ఎస్పీ దామోదర్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దిశ, డీటీసీ, ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్‌స్పెక్టర్లు సుధాకర్, షమీముల్లా, సుబ్బారావు, గ్రీవెన్స్ సెల్ ఎస్సై రజియా సుల్తానా బేగం తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ దామోదర్

ఇజ్రాయిల్ పంపిస్తానంటూ మోసం

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉపాధి కోసం ఇజ్రాయిల్ పంపిస్తానని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం కొమరగిరిపట్నానికి చెందిన పాస్టర్ ఆకుల షాలెంరాజు డబ్బులు తీసుకుని మోసం చేశారని బాధితులు వాపోయారు. సోమవారం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఒక్కొక్కరి నుంచి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేశాడన్నారు. తర్వాత కాలయాపన చేస్తుండటంతో గట్టిగా నిలదీయగా టూరిస్టు వీసాపై జోర్డాన్ తీసుకు వెళ్లి 15 రోజుల తర్వాత హైదరాబాద్ తీసుకువచ్చి వదిలేశాడని వాపోయారు. తామిచ్చిన సొమ్ము ఇవ్వాలని అడిగితే తిరిగి బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. బాధితుల్లో అమలాపురం, రావులపాలెం, రాజోలు, పి.గన్నవరం, అంతర్వేది, పాలకొల్లు, ఒంగోలు ప్రాంతాలకు చెందిన 33 మందికిపైగా ఉన్నట్లు వారు తెలిపారు. అనంతరం ఆకుల షాలెంరాజు, ఆయన భార్యపై అల్లవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై హరీష్‌కుమార్‌ను వివరణ కోరగా ఫిర్యాదు తీసుకుని విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

డీజీపేట కేసు ఛేదనకు నాలుగు బృందాలు



సంఘటనా స్థలంలో జాగిలం బృందం, సీఐ భీమానాయక్, ఎస్సై సుమన్

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: కలకలం రేపిన డీజీపేట హత్య కేసు నిందితులను పట్టుకునేందుకు నాలుగు పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు పామూరు సీఐ ఎం.భీమానాయక్ చెప్పారు. ఆదివారం స్థానికురాలు రత్తమ్మ పొలంలో గడ్డి కోసం వెళ్లిన సమయంలో దుండగులు హత్య చేసి ఆమె వద్ద ఉన్న బంగారం తీసుకుని పరారయ్యారు. ఈ మేరకు సోమవారం సంఘటనా స్థలాన్ని సీఐ భీమానాయక్, ఎస్సై ఆర్.సుమన్ పరిశీలించారు. జాగిలం బృందం, ఆధారాల సేకరణ సభ్యులు ఆధారాలను సేకరించారు. దోచుకున్న బంగారం విలువ రూ.1.20 లక్షలుంటుందని వివరించారు. శవ పంచనామా పూర్తిచేసి పోస్టుమార్టానికి కనిగిరి ప్రభుత్వ సామాజిక వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. హత్య చేసింది స్థానికులా లేదా బయటి వ్యక్తులా అనే కోణంలో విచారిస్తున్నారు. మెడలో ఉన్న ఆభరణాలు చోరీ చేసిన ఘటనలు గతంలో స్థానికంగా చోటు చేసుకున్నాయి.. అయితే హత్యచేసి బంగారు ఆభరణాలు దోచుకున్నవి జరగకపోవడంతో స్థానికులు భీతిల్లుతున్నారు.

ముగ్గురి ఉసురుతీసిన అజాగ్రత్త

◗ వేర్వేరుచోట్ల జారిపడి ఇద్దరు..
◗ విద్యుదాఘాతంతో మరొకరి మృతి



శ్రీకాంత్ మృతదేహం

మద్దిపాడు, న్యూస్‌టుడే: చిరు అజాగ్రత్త ముగ్గురి ప్రాణాలు హరించింది. వేర్వేరు చోట్ల కాలుజారి పడి ఇద్దరు మృతిచెందగా, విద్యుదాఘాతం మరొకరి ప్రాణాలు హరించింది. ఈ విషాద సంఘటనలు మద్దిపాడు, చీమకుర్తి, పోలీస్ స్టేషన్ల పరిధిలో చోటు చేసుకున్నాయి. పోలీసుల కథనం ప్రకారం..దొడ్డవరప్పాడుకు చెందిన గడ్డం శ్రీకాంత్ (42) వ్యవసాయ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. అయ్యప్ప స్వామి మాల వేసుకునే ఆలోచనలో ఉన్న శ్రీకాంత్ సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. మధ్యాహ్నం అయినా రాకపోయేసరికి ఆందోళన చెందిన కుటుంబసభ్యులు వెతుకుతుండగా స్థానికంగా ఉన్న చెరువులో ఆయన మృతదేహం కన్పించింది. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాలు జారి చెరువులో పడి మృతి చెంది ఉంటారని ఎస్సై శివరామయ్య చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మృతునికి భార్య శ్రీలత, కుమారుడు సాహిత్ ఉన్నారు.

చీమకుర్తిలో కార్మికుడు...

చీమకుర్తి, న్యూస్‌టుడే: మురుగు కాలువలో పడి ఓ కార్మికుడు మృతి చెందారు. చీమకుర్తి పట్టణంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నంలోని గాజువాకకు చెందిన పీరు(47) గత పదేళ్లుగా చీమకుర్తిలో ఉంటూ... వివిధ క్వారీల్లో జాకీ కార్మికుడిగా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం... ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం ఎదురుగా ఉన్న ఉన్న మురుగు కాలువలో విగతజీవిగా పడి ఉన్న ఆయనను స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. ఆదివారం రాత్రి... కాలువలో పడిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ ఎం.సుబ్బారావు తెలిపారు.

విద్యుదాఘాతంతో..



సుబ్బారావు (పాత చిత్రం)

చీమకుర్తి: నేల మీద పడివున్న విద్యుత్తు తీగ తగిలి ఓ రైతు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన సోమవారం చీమకుర్తి మండలం తొర్రగుడిపాడు పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మంచికలపాడుకు చెందిన కోరా సుబ్బారావు(39) తొర్రగుడిపాడు పొలాల్లో ఉన్న విద్యుత్తు మోటారు వేసేందుకు వెళ్లారు. ఆ సమయంలో మోటారుకు సమీపంలోని గడ్డిలో పడివున్న విద్యుత్తు తీగలను ఆయన గమనించలేదు. అక్కడ కాలువేసి స్విచ్ వేసేందుకు ప్రయత్నిస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందారు. కుటుంబ పెద్ద మృతిచెందడంతో భార్య, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. సుబ్బారావు భార్య సుమాంజలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎం.సుబ్బారావు తెలిపారు. మృతిచెందిన రైతు కుటుంబానికి పరిహారం అందజేసి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు, బెజవాడ శ్రీనివాసరావు, చిన్నపురెడ్డిలు ఓ ప్రకటనలో కోరారు.

అడ్డు తొలగించుకునేందుకే హత్య

◗ ఊళ్లపాలెం కేసులో నిందితుడి అరెస్టు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: నాలుగు రోజుల క్రితం ఊళ్లపాలెంలో భార్య గొంతు కోసి హత్య చేసిన సంఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి సోమవారం న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. దీనికి సంబంధించి సీఐ హజరత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం..ఊళ్లపాలేనికి చెందిన పుట్టా వెంకట్రావు, తిరుపతమ్మ దంపతులు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. భార్యాభర్తలు పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. ఏడాది నుంచి నిందితుడు మద్యానికి బానిసై గ్రామంలో మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. దీంతో తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో భార్య అడ్డు తొలగించుకోవాలని భావించి గత గురువారం మద్యం తాగి ఇంటికి వెళ్లి ఆమెపై దాడికి దిగాడు. తిరుపతమ్మ తన వద్ద ఉన్న కర్రతో అడ్డగించబోగా, వెంకట్రావు ఇంట్లో ఉన్న కత్తి తీసుకుని ఆమె గొంతుకోసి పరారయ్యాడు. సోమవారం ఉదయం నిందితుడు స్థానిక కందుకూరు వంతెన వద్ద ఉండగా, సిబ్బందితో వెళ్లి అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టగా రిమాండ్ విధించారు.

మనస్తాపంతో బాలిక ఆత్మహత్య

మార్కాపురం, న్యూస్‌టుడే: మనస్తాపంతో ఓ బాలిక ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మార్కాపురం పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు గొట్టిపడియకు చెందిన కొండేపోగు సువర్ణ- మరియదాసు దంపతులు. మనస్పర్థలతో వారు విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. ఆరు నెలల కిందట తల్లి సువర్ణ, కుమార్తె అరుణ (16) కలిసి గొట్టిపడియ నుంచి మార్కాపురంలోని ఎస్సీ, బీసీకాలనీకి వచ్చి అద్దెకుంటున్నారు. గత కొంత కాలంగా వేదన చెందుతున్న అరుణ ఆరోగ్యం క్షీణించింది. దీంతో ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. గమనించిన తల్లి మార్కాపురం సర్వజన వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మార్కాపురం పట్టణ ఎస్సై ఎం.సైదుబాబు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 530 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 133, రిటైల్ లైవ్ - 155, చికెన్ విత్ స్కిన్ - 225, చికెన్ స్కిన్‌లెస్- 256

మార్కాపురం

•మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం



మార్కాపురం: పోటీలో పాల్గొన్న విద్యార్థులు, విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ నాగరాజు, సిబ్బంది

ప్రతిభా పరీక్షలతో విజ్ఞానం

మార్కాపురం పట్టణం : పట్టణంలోని భాష్యం పాఠశాలలో సోమవారం ‘ఈనాడు’ ఆధ్వర్యంలో విద్యార్థులకు ‘ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం’ అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన జి.తారిక (9వ తరగతి) మొదటి బహుమతి, బి.దేవశ్రీ (8వ తరగతి), ఎస్‌కె.సబీహ (8వ తరగతి)లు మూడో బహుమతి గెలుచుకొని ప్రతిభను చాటారు. వీరికి పాఠశాల ప్రిన్సిపల్ కె.నాగరాజు, ఇతర సిబ్బంది బహుమతులు అందజేశారు. కంభం : పట్టణంలోని ఆల్ఫా ఉన్నత పాఠశాలలో సోమవారం ‘ఈనాడు’ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ‘ఇంటర్నెట్ వల్ల లాభ నష్టాలు విద్యార్థులపై సోషల్ ప్రభావం’ అనే అంశంపై 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో కె.సూర్య నారాయణ, ఎం.రాధిక, ఎస్. ఇళయరాజ మొదటి మూడు బహుమతులు గెలుచుకున్నారు. వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రితీష్ టి.నాయర్, ఉపాధ్యాయుడు మస్తాన్ బహుమతులు అందజేశారు.



కంభం : పరీక్ష రాస్తున్న విద్యార్థులు, గెలుపొందిన వారితో ప్రధానోపాధ్యాయుడు రితీష్ టి.నాయర్, ఉపాధ్యాయుడు మస్తాన్

భక్తిశ్రద్ధలతో గంధ మహోత్సవం

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి తూర్పుపాలెంలోని మహబూబ్ సుభానీ దర్గాలో గంధమహోత్సవాన్ని వైభవంగా సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దర్గాను విద్యుద్దీపాలు, పూలతో అలంకరించారు. ముస్లిం మహిళలు అధిక సంఖ్యలో దర్గాలో కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి గంధాన్ని, ప్రసాదాన్ని స్వీకరించారు. తూర్పుపాలెం ముస్లిం యూత్, కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

సేవలకు పురస్కారం

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి లోని దివ్యాంగ రక్షక్ ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.అంజనేయులుకు సత్తెనపల్లికి చెందిన ‘హెల్ప్’ ఫౌండేషన్ వారు ఆదివారం సత్తెనపల్లిలో జరిగిన కార్యక్రమంలో పురస్కారం అందజేశారు. పొదిలిలో కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకుగాను ఈ పురస్కారానికి ఎంపికయ్యారు.

నోటీసులతో సరి పెడతారేమో?

❑ చెరువును చెరబట్టినవారికి హెచ్చరికల జారీ ❑ చర్యలకు ముహూర్తం ఎప్పుడో?



మార్కాపురం నడిబొడ్డున ఉన్న ఆయకట్టు చెరువు

మార్కాపురం, న్యూస్‌టుడే:

మార్కాపురం నడిబొడ్డున ఉండే పెద్ద చెరువును అక్రమార్కులు చెరబట్టారు. మార్కాపురం- ఒంగోలు రహదారిలో ఉన్న డ్రైవర్స్ కాలనీ, పారిశ్రామికవాడతో పాటు ఇటు లక్ష్మీచెన్నకేశవనగర్‌తో పాటు విద్యనగర్, కొండారెడ్డికాలనీ, పూలసుబ్బయ్యకాలనీ శివారు ప్రాంతాలు ఎక్కువగా చెరువును ఆనుకొని ఉంటాయి. దీంతో అక్రమార్కులు ఇది వరంలా మారింది. సర్వే నంబరు 549లో మొత్తం 584 ఎకరాలల్లో ఉన్న ఈ చెరువులో ఆక్రమణలు పెరిగిపోయాయి. చెరువుతో పాటు చెరువుకు చెందిన అలుగును కూడా ఆక్రమించి దుకాణాలను ఏర్పాటు చేసుకొని అద్దెలకు ఇచ్చారు.

ఆక్రమణలో 3.30 ఎకరాలు

ఈ నెల 14న ‘ఈనాడు’లో చెరువు ఆక్రమణలపై కథనం ప్రచురితం కావడంతో. స్పందించిన ఉప కలెక్టర్ వెంకట త్రివినాగ్‌తో పాటు తహసీల్దారు చిరంజీవి చెరువును పూర్తి స్థాయిలో సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ చెరువును చుట్టూ పక్కల ఉన్న పొలాల వాళ్లు, నివాసాల వాళ్లు అందరూ కలిసి చెరువును నాలుగు పక్కల అధికారులు చేసిన సర్వే ప్రకారం 3.30 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు తేల్చారు. మండల సర్వేయరు సంజీవయ్య ఆధ్వర్యంలో సుమారు 10 మంది సర్వేయర్లు 15 రోజుల పాటు సర్వే చేసి పూర్తి స్థాయిలో ఆక్రమణలు చేసిన వారిని గుర్తించారు. చెరువును చెరబట్టిన వారిని అధికారులు చివరకు గుర్తించారు. చెరువును ఆక్రమణలు చేసిన సుమారు 62 మందికి రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు.

గతంలోనూ సర్వే చేసి...

చెరువు ఆక్రమణలపై గతంలోను అధికారులు పూర్తి స్థాయిలో సర్వే చేశారు. అప్పట్లోను డివిజన్ స్థాయి, మండల స్థాయి సర్వేయర్లు అందరూ కలిసి పది రోజులు సర్వే చేసి ఆక్రమణను గుర్తించారు. చెరువులోకి వచ్చిన నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారు, పొలాలు, రహదారిలోకి కలుపుకున్న వారిని గుర్తించినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కనీసం అక్రమణదారులకు నోటీసులు కూడా జారీ చేయలేదు. గతంలో మాదిరిగానే ఇప్పుడు కూడా సర్వే చేసిన అధికారులు ఆక్రమణలను తొలగించకుండా కేవలం సర్వేకు, నోటీసులు జారీ చేయడానికి పరిమితం అవుతారో లేదో చూడాలని వేసి చూడాలని మార్కాపురం పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. చెరువులో ఆక్రమణలను తొగించి చుట్టూ కంచెతో పాటు అయిదు అడుగుల లోతులోను చెరువు చుట్టూ కందకం మాదిరిగా తీయించాలని ప్రజలు కోరుతున్నారు.



చెరువును సర్వే చేస్తున్న సర్వేయర్లు

కొనసాగుతున్న దీక్షలు

మార్కాపురం పట్టణం: మున్సిపల్ కార్మికుల పట్ల అధికారులు మొండి వైఖరి విడనాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం.రఫీ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం గేటు ముందు సోమవారం వారు నిరసన కార్యక్రమం నిర్వహించారు. వెంటనే తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

క్షేత్ర సహాయక సిబ్బందికి శిక్షణ

బేస్తవారపేట: బేస్తవారపేట లోని స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో రంగనాయకులు ఆధ్వర్యంలో ఉపాధి హామీ క్షేత్ర సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. యాప్‌ల వినియోగం, మార్కింగ్, కొలతలపై కోర్సు డైరెక్టర్ రాజేష్ శిక్షణ అందించారు.

అక్రమ కట్టడాలను అడ్డుకోండి

‘మీ కోసం’లో అర్జీదారుల వేడుకోలు

మార్కాపురం, న్యూస్‌టుడే : అక్రమ కట్టడాన్ని అడ్డుకోవాలని పెద్దనాగులవరం గ్రామస్థులు సోమవారం ఉప కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సోమవారం స్థానిక ఉప కలెక్టర్ కార్యాలయంలో ఉప కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ అధ్యక్షతన మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు మండలాల నుంచి 25 దరఖాస్తులు వచ్చినట్లు కార్యాలయం సిబ్బంది తెలిపారు. ● మండలంలోని పెద్దనాగులవరంలో బీసీకాలనీ వెళ్లే ప్రధాన రహదారిని ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపడుతున్న వైకాపా నాయకుడు, దీంతో ఒర్వు ఏడుకొండలుపై చర్యలు తీసుకోవాలని తురక శ్రీనివాసులు ఆధ్వర్యంలో మహిళలు, గ్రామస్థులు ఉప కలెక్టర్‌ను కోరారు. స్థలం గురించి ఎవరైనా అడిగితే దౌర్జన్యం చేస్తున్నారని, ఎవరూ నన్ను ఎవరూ ఏమీ చేయలేరని బెదిరిస్తున్నారని తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఉప కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డి.శ్రీనివాసులు, టి.శ్రీను, లక్ష్మయ్య, గాలెమ్మ, డి.నాగమల్లేశ్వరి, సుజాత, భవనేశ్వరి, సుబ్బులు, లక్ష్మమ్మ, అంకమ్మ, వెంకటమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు. ● సోమవారం తహసీల్దారు కార్యాలయంలో మీ కోసం కార్యక్రమాన్ని తహసీల్దారు చిరంజీవి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంతో పాటు పట్టణంలోని పలువురు అర్జీదారులు దరఖాస్తులు అందజేశారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఉప కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్

అమరుల త్యాగాలు మరువలేనివి

మార్కాపురం,కంభం, గిద్దలూరు పట్టణం, యర్రగొండపాలెం పట్టణం: పోలీసు అమర వీరుల త్యాగాలు మరువలేనివని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా మార్కాపురంలో సోమవారం పోలీసు అధికారులు, సిబ్బంది, నాయకులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కంభం బస్టాండ్ కూడలి వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ● కంభం పట్టణంలో సీఐ మల్లికార్జున ఆధ్వర్యంలో కంభం బస్టాండ్ నుంచి కందులాపురం కూడలి వరకు పోలీసు సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు ప్రదర్శన నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ● గిద్దలూరులో గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రామకోటయ్య, రాచర్ల, కొమరోలు ఎస్సైలు, పోలీసులు పాల్గొన్నారు ● యర్రగొండపాలెంలో సీఐ ప్రభాకరరావు ఆధ్వర్యంలో పోలీసులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ కూడలిలో మానవ హారం ఏర్పాటు చేశారు.



మార్కాపురంలో ర్యాలీలో నిర్వహిస్తున్న విద్యార్థులు



కంభంలో పోలీసుల కవాతు



వై.పాలెంలో ర్యాలీ చేస్తున్న పోలీసులు

గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

అర్ధవీడు, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సోమవారం మొహిద్దీన్‌పురం, అర్ధవీడు, పాపినేనిపల్లె గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మూడు గ్రామాల పరిధిలోని వీధుల్లో అభివృద్ధి శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఎన్నో ఏళ్ల నాటి సమస్యలు సీసీ రోడ్ల నిర్మాణంతో తీరనుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల పార్టీ అధ్యక్షులు బండ్లమూడి అంజనేయులు, ఎంపీపీ వెంకటరావు, ఎంపీడీవో నరసయ్య, మండల తెదేపా నాయకులు, ఉపాధిహామీ అధికారులు పాల్గొన్నారు. ●గిద్దలూరు పట్టణం: తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం గిద్దలూరు నగర పంచాయతీలోని తెదేపా కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈనెల 26వ తేదీ నుంచి చేపట్టనున్న ఈ కార్యక్రమంలో గతంలో కంటే అధికంగా సభ్యత్వ నమోదు చేయాలని కోరారు. ● స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాలు అందించి ఆర్థికంగా పురోభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ సిబ్బందికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సూచించారు. ఆయన సోమవారం తన నివాస గృహంలో నియోజకవర్గంలోని డీఆర్‌డీఏ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు.



మొహిద్దీన్‌పురంలో శిలాఫలక ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి..

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం : 8008552658
కంభం : 8008632343
పొదిలి : 8008550360

బేస్తవారపేట, న్యూస్‌టుడే:



సమస్య: స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో రహదారి పక్కన ఏర్పాటు చేసిన పరివర్తకాల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయి విద్యుత్తు తీగలకు తాకుతున్నాయి. విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతోంది. పిచ్చి మొక్కలను తొలగించండి. – స్థానికులు, బేస్తవారపేట.
సమాధానం: సిబ్బందిని పంపి పిచ్చి మొక్కలను తొలగిస్తాం.
– సన్యాసిరావు, విద్యుత్తుశాఖ ఏఈ, బేస్తవారపేట

పంట నష్టం పరిశీలన



కొండాయపాలెంలో పొగాకు పంటను పరిశీలిస్తున్న బోర్డు సిబ్బంది

పొదిలి గ్రామీణం, బేస్తవారపేట, తర్లుపాడు, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలకు పొగాకు పంట దెబ్బతినడంతో సమాచారం అందుకున్న పొదిలి పొగాకు బోర్డు అధికారులు సోమవారం పొగాకు పంటలను పరిశీలించారు. మండలంలోని కొండాయపాలెంలో పర్యటించి వర్షాలకు పంటలో నీరు నిలిచి దెబ్బతిన్న పంటలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ● బేస్తవారపేట మండలంలోని గలిజేరుగుళ్లలో కోత దశలో ఉన్న సజ్జ పంటను ఏవో జక్కం మెర్సీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో సుమారు 125 హెక్టార్ల మేర సజ్జ పంటకు నష్టం జరిగినట్లు అంచనా వేసి ప్రాథమిక నివేదికను పంపినట్లు పేర్కొన్నారు. ● తర్లుపాడు మండలంలోని తాడివారిపల్లె, నాగెళ్లముడుపు, చెన్నారెడ్డిపల్లె, తర్లుపాడు గ్రామాల్లో వర్షాలకు నష్టపోయిన మిరప, బత్తాయి, టమోటా పంటలను సోమవారం మార్కాపురం ఉద్యానశాఖ హెచ్‌వో రమేష్ పరిశీలించారు. నష్టాలను నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.



గలిజేరుగుళ్లలో మొలకెత్తిన సజ్జ కంకులను పరిశీలిస్తున్న ఏవో మెర్సీ

పేద విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యం

మార్కాపురం, న్యూస్‌టుడే: ఏపీ-తెలంగాణలో ఉన్న రజక పేద విద్యార్థుల అభివృద్ధే రజక విద్యా సేవా సంక్షేమ సంఘం లక్ష్యమని ఏపీ- తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షుడు దేవలాటి శంకర్ పేర్కొన్నారు. సోమవారం మార్కాపురంలోని కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల తోడ్పాటుతో విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, పదో తరగతిలో ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి ఈ ప్రాంతంలోని పేద విద్యార్థులకు నగదు ప్రోత్సాకాలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎంపిక

మార్కాపురం, పెద్దదోర్నాల: మార్కాపురంలో సోమవారం ఏపీ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ మార్కాపురం యూనిట్ నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. మార్కాపురం జూనియర్ ఆఫీసర్స్ అసోసియేషన్ యూనిట్ అధ్యక్షుడిగా పి.కరిముల్లా, ఉపాధ్యాక్షుడిగా కె.శశిభూషణ్ యాదవ్, జనరల్ కార్యదర్శిగా ఎం.వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక కార్యదర్శిగా జి.సుధాకర్‌లు ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శి టి.బాలకుమారి, కోశాధికారిగా అబ్దుల్ జబ్బార్‌లను ఎన్నుకున్నారు.. ● మాదిగ చర్మడప్పు కళాకారుల పరిరక్షణ సమితి నూతన మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. స్థానిక శివసదనంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నల్లూరి నాగయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా పందిటి కిషోర్‌బాబు, వర్కింగ్ టీం అధ్యక్షుడిగా బండూరి శ్యాము, కార్యవర్గ కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు కిషోర్ బాబు తెలిపారు.

రైతు సేవా కేంద్రాల్లో యూరియా : కంభం (రాచర్ల), న్యూస్‌టుడే : రాచర్ల -1, 2, ఆరవీటికోట, అనుమలవీడు, ఆకవీడు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రెజ్లింగ్‌లో గొట్లగట్టు విద్యార్థుల సత్తా

కొనకనమిట్ల, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన రెజ్లింగ్ పోటీల్లో గొట్లగట్టులోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు విష్ణువర్ధన్‌రెడ్డి, వర ప్రసాద్, ఉమాశంకర్, దుర్గా ప్రసాద్, వెంకటయ్య, నవీన్, యువరాజు, పి.విష్ణువర్ధన్‌రెడ్డిలు ప్రతిభ కనపర్చినట్లు ప్రధానోపాధ్యాయురాలు ఎం.విజయలక్ష్మి తెలిపారు. వచ్చే నెల 16వ తేది నుండి 20వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

స్కేటింగ్ పోటీల్లో సత్తా చాటారు

మార్కాపురం : మండలంలోని బోడపాడులోని రాక్‌వెల్ స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించిన స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ చూపి 3 బంగారు పతకాలు, 8 వెండి పతకాలు, 15 కాంస్య పతకాలు సాధించిన పాఠశాల ప్రిన్సిపల్ నవీన్‌కుమార్ తెలిపారు. విద్యార్థులను, వ్యాయామా ఉపాధ్యాయుడిని డైరెక్టర్లు వెన్నా నాగార్జునరెడ్డి, సింధూజలు ప్రత్యేకంగా అభినందించారు.

మార్కాపురం పట్టణం : జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీల్లో పట్టణంలోని కమలా పాఠశాల విద్యార్థులు సత్తాచాటినట్లు ప్రిన్సిపల్ స్వరూప్ రంజన్ తెలిపారు. ఈనెల 20న అద్దంకిలో జరిగిన ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన కె.నందకిషోర్, కె.దియాలు మూడో స్థానంలో నిలిచి ప్రతిభ చాటారని వివరించారు. వీరిని సోమవారం పాఠశాల సిబ్బంది అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

వాలీబాల్ రాష్ట్ర జట్టుకు ఎంపిక

కొమరోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి ప్రకాశం అండర్-17 స్కూల్ గేమ్స్‌లో భాగంగా ఒంగోలు త్రోవగుంట ఉన్నత పాఠశాలలో ఈ నెల 19న జరిగిన వాలీబాల్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు రాజుపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థి బి.వి.జయచంద్ర ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, పీడీ పరిమళలు తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు హిందూపురంలో జరిగే పోటీలలో జయచంద్ర పాల్గొంటున్నట్లు తెలిపారు.



జయచంద్ర

అసత్య ప్రచారం తగదు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: వైకాపా నాయకులు తెదేపాపై లేనిపోని అసత్య ఆరోపణలను చేస్తున్నారని తెదేపా వై.పాలెం, పుల్లలచెరువు మండల పార్టీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, పయ్యావుల ప్రసాద్‌లు పేర్కొన్నారు. సోమవారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మా నాయకుడు ఎరిక్షన్‌బాబుపై అబద్ధపు మాటలు మాట్లాడితే ఊరుకునేది లేదని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తర్లుపాడులో పిడుగు పడి గేదె మృతి

తర్లుపాడు, న్యూస్‌టుడే: తర్లుపాడులో సోమవారం పిడుగు పడి గేదె మృతిచెందింది.. దుర్గెంపూడి సుబ్బారెడ్డి అనే రైతు తన పాడి గేదెను మేతకు తీసుకెళ్లి వస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మొదలైంది. దీంతో రైతు పక్కనే ఉన్న ఆసుపత్రి భవనంలోకి వెళ్లారు. ఆ సమయంలోనే పిడుగు పడి పాడి గేదె మృతి చెందింది.

సూపర్ సిక్స్ అమలు చేయాలి

కంభం (రాచర్ల): సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పగడాల రంగస్వామి పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సోమవారం బస్సులోని ప్రయాణికులకు పోస్టు కార్డులు అందించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సత్యనారాయణ, రంగనాయకులు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బస్సులో మహిళలకు కార్డులు అందజేసి వివరిస్తున్న పగడాల రంగస్వామి

వానొస్తే వణుకే

◗ అస్తవ్యస్త కాలువతో అవస్థలు ◗ తటాకాలను తలపిస్తున్న వీధులు



బీసీ కాలనీలో జలమయమైన రహదారి

బేస్తవారపేట, న్యూస్‌టుడే:

అధికారులు, పాలకులు ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని మాటలు చెబుతున్న క్షేత్ర స్థాయిలో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వారం రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బేస్తవారపేట పంచాయతీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అస్తవ్యస్తమైన డ్రైనేజీ, నీరు వెళ్లేందుకు సరైన కాలువలు లేకపోవడంతో పలు వీధుల్లోని రహదారులు చిన్నపాటి వర్షానికే చెరువులను తలపిస్తున్నాయి. మూడేళ్ల కిందట చేపట్టిన జాతీయ విస్తరణ పనులు అరకొరగా చేపట్టడంతో గృహాలు, అంతర్గత రహదారుల నుంచి వచ్చే నీరు బయటికి వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. దీంతో వర్షం కురిసిన ప్రతిసారి రహదారులు, కాలువలు చెరువుల్లా మారిపోతున్నాయి. బీసీ కాలనీ, మర్రిచెట్టు వీధి, రాణీపేట, గొంట్లవారి వీధి, గాంధీ బజార్, జగన్నాయకుల వీధి, నెహ్రూబజార్ తదితర ప్రాంతాల్లోని నివాస గృహాల్లోకి నీరంతా వచ్చి చేరుతుండటంతో సామగ్రి తడిసిపోతున్నాయి. పంచాయతీలో చాలా ప్రాంతాల్లో పక్కా కాలువలు నిర్మించక పోవడంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచి తటాకాలను తలపిస్తోంది. మురుగు నిలిచి ఉండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎన్నిసార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. విజ్ఞాన్ కళాశాలకు వెళ్లే దారిలో, అంబేడ్కర్ కాలనీ, పాపాయిపల్లె తదితర ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో సీసీ రహదారులు, మురుగు కాలువలు లేవు. దీంతో ఆయా కాలనీవాసులు చిన్నపాటి వర్షం కురిసినా ఇబ్బందులు పడుతున్నారు.

పంచాయతీ: బేస్తవారపేట	గ్రామాలు: బేస్తవారపేట, సోమవారపేట, పాపాయిపల్లె		
జనాభా: సుమారు 15వేలు	వార్డులు: 16	కుటుంబాలు: 3200	సచివాలయాలు: 02

సమస్య పరిష్కారానికి చర్యలు..

అంతర్గత రహదారుల నిర్మాణానికి, కాలువలు ఇతరత్రా పనులకు సంబంధించి రూ.93 లక్షలు మంజూరయ్యాయి. రహదారులు, పక్కా కాలువలు లేని చోట వాటి నిర్మాణానికి మోక్షం కలగనుంది. అన్ని వీధుల్లోని కాలువల్లో పూడికతీత తీయించి మురుగు, వర్షపునీరు వెళ్లేలా సిబ్బందితో కాలువలను శుభ్రం చేయిస్తాం. సర్పంచితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
– రమేష్, ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ, బేస్తవారపేట.

మర్రిపూడి, న్యూస్‌టుడే:

సమస్య: మర్రిపూడి నడిగడ్డ వీధిలోని కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో మురుగునీరు రోడ్డుపైనే నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. –వెంకటయ్య, స్థానికుడు

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి కాలువలు శుభ్రం చేయిస్తాం. –శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి

కనిగిరి

• కనిగిరి • దర్శి • కొండపి

చెడ్డీ గ్యాంగ్‌తో అప్రమత్తం

సింగరాయకొండ గ్రామీణం: మండల ప్రజలు చెడ్డీ గ్యాంగ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ హజరత్తయ్య సూచించారు. స్థానిక సర్కిల్ కార్యాలయం వద్ద సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో ఒంగోలులో ఇతర రాష్ట్రాలకు చెందిన చెడ్డీ గ్యాంగ్ కలకలం రేపిందన్నారు. వారు చాలా ప్రమాదకరమైన వ్యక్తులని, శివారు ప్రాంతాలు, తాళం వేసి ఉన్న గృహాలే లక్ష్యంగా చోరీలకు పాల్పడతారని వివరించారు. నేరాలు చేసే సమయంలో వ్యక్తులు ఎదురైతే హత్య చేస్తారని, ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. వ్యాపారులు దుకాణాలు, మండల కేంద్రంలో ప్రతి ఇంటికీ సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని, విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలు, నగదు భద్రపరచుకోవాలని సూచించారు. సమాచారం అందిస్తే సిబ్బందితో ఆయా ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేసి భద్రత కల్పిస్తామని తెలిపారు.

రచనపై పట్టు.. బహుమతి తెచ్చి పెట్టు

‘ఈనాడు’ ఆధ్వర్యంలో సోమవారం కనిగిరి మున్సిపాలిటీలోని చింతలపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల, సింగరాయకొండ మండలం మూలగుంటపాడులోని శ్రీవిద్యా నికేతన్ పాఠశాల, దర్శి మండలం రాజంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. ‘ఇంటర్నెట్ వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం’ అనే అంశంపై జరిగిన వ్యాస రచన పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చింతలపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి కె.కళావతి, కె.దీక్షిత, పి.తన్వేష్‌లు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వారికి పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది కార్యదర్శి, ఆంగ్ల ఉపాధ్యాయుడు కోమటిగుంట వెంకటేశ్వర్లు బహుమతులు అందజేశారు. ఇన్‌ఛార్జి హెచ్‌ఎం అరుణ, ఉపాధ్యాయులు రమణయ్య, ఆదిలక్ష్మి, వయోలారాణి తదితరులు పాల్గొన్నారు. మూలగుంటపాడు శ్రీవిద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు ఎస్.రాధికాశరణ్య, టి.వైష్ణవి, షేక్ సమియాలు ప్రతిభ చాటగా వారికి పాఠశాల కరెస్పాండెంట్ సైకం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు సింధు, సిరాజ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. రాజంపల్లి పాఠశాలకు చెందిన దాసరి ప్రశాంత్‌కుమార్, శాగం రాజశేఖర్, రాగిపిండి స్పందనలు విజేతలుగా నిలిచారు. వారికి ప్రధానోపాధ్యాయుడు చంద్రమోహన్ చేతులమీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు రామిరెడ్డి, అల్లాభక్షు, కోటేశ్వరరావు, ప్రదీప్, సరోజ తదితరులు పాల్గొన్నారు.

-న్యూస్‌టుడే, కనిగిరి, దర్శి, సింగరాయకొండ గ్రామీణం



కనిగిరి: విజేతలకు బహుమతులు అందజేస్తున్న వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో శ్రీవిద్యానికేతన్ పాఠశాల కరెస్పాండెంట్ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు



విజేతలతో రాజంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చంద్రమోహన్, ఉపాధ్యాయులు

ఆదాయం ఘనం.. అభివృద్ధి అంతంతమాత్రం

న్యూస్‌టుడే, పామూరు

• పామూరులో వసతుల లేమితో ప్రజల అవస్థలు

పామూరు మేజర్ పంచాయతీ అయినా, విద్యా వ్యాపార పరంగా పట్టణాలకు దీటుగా నిలుస్తోంది. చుట్టుపక్కల మండలాలకు చెందిన అనేక మంది ఇక్కడే స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకుని వ్యాపారాలు, ఇతర పనులు చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటున్నారు. దీంతో జనాభా పెరుగుతోంది. ఆ మేరకు వసతులు మాత్రం కానరావడం లేదు. వైకాపా అయిదేళ్ల పాలనలో మౌలిక వసతుల కల్పనపై పెద్దగా దృష్టిసారించని ఫలితంగా నేడు అవస్థలు ఎక్కువయ్యాయి. ఇప్పటికీ అత్యధిక అంతర్గత రహదారులు మట్టి రోడ్లే. సిమెంట్ రోడ్లు ఉన్నచోట మురుగు కాలువలు లేవు. పారిశుద్ధ్యం, విద్యుత్తు సరఫరా తదితర సమస్యలతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. పంచాయతీకి ఆదాయం ఘనంగా వస్తున్నా ఆశించిన స్థాయిలో అభివృద్ధి పనులు జరగడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఏడాదికి జనరల్ ఫండ్ ద్వారా రూ.1.5 కోట్లు, ప్రభుత్వం నుంచి పలు రకాల గ్రాంట్ల రూపంలో సుమారు రూ. కోటి వరకు సమకూరుతోంది. ఇందులో పంచాయతీలో పనిచేస్తున్న 70 మందికి పైగా పారిశుద్ధ్య ఇతర సిబ్బందికి రూ.90 లక్షల జీతాలు చెల్లిస్తున్నారు. నేతాజీనగర్, శ్రీనివాసనగర్, పీకేఎం, న్యూ అయ్యప్ప, ఎన్.వీరాటినగర్, విరువూరు రోడ్డు, అంకాళమ్మ వీధి, ఎన్జీవో కాలనీ, చెన్నకేశవ నగర్, డీసీపాలెం తదితర ప్రాంతాల్లో 70 వరకు మట్టిరోడ్లే కనిపిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో వర్షాలకు ఇవి మరింత అధ్వానంగా ఉండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. 18 కిలోమీటర్లకు పైగా సిమెంట్ రహదారులు నిర్మించాల్సి ఉంది. రవికామందిర్ థియేటర్ నుంచి 565 జాతీయ రహదారి వరకు ఒక వరుస సిమెంట్ రహదారి ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రామంలోని సమస్యలపై పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందును వివరణ కోరగా.. నిధుల లభ్యతను బట్టి దశల వారీగా సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తామన్నారు. రూ. 5 కోట్లతో 9.5 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు.

వ్యాపార కేంద్రం పామూరు వివరాలు	
కుటుంబాలు:	12,000
జనాభా:	32,000
వీధి దీపాలు:	1600



నేతాజీనగర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు



ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద ప్రమాదకరంగా కాలువ

మురుగు కాలువలు లేక ఇబ్బందులు

పామూరులోని ఎన్జీవో కాలనీ, అంకాళమ్మ వీధి, డీసీపాలెం, చెన్నకేశవనగర్, పోతవరం రోడ్డు తదితర ప్రాంతాల్లో మురుగు కాలువల నిర్మాణం చేపట్టలేదు. సుమారు 23 కిలోమీటర్లకు పైగా కాలువలు లేకుండానే రోడ్లు ఉన్నాయి. దీంతో ఇళ్ల నుంచి వాడకపు నీరు రహదారులపైకి చేరుతోంది. పలుచోట్ల కాలువలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయాయి. రహదారుల పక్కనే చెత్త వేయడంతో పారిశుద్ధ్యం లోపిస్తుంది. మరోవైపు ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రాంగణంలోకి వెళ్లే రహదారి పక్కన మురుగు కాలువ స్లాబు పడిపోయింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముందు కాలువపై మూతలు లేక ప్రమాదకరంగా దర్శనస్తోంది.



కాపు వీధిలో రహదారిపై మురుగు

టంగుటూరులో ఉచిత కంటి వైద్య శిబిరం

టంగుటూరు, న్యూస్‌టుడే: టంగుటూరులో రావూరి వినీల మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. 90 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా.. 51 మందికి శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు నిర్ధారించారు. ఉచితంగా మందులను అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ రావూరి తిరుమల రాధాకృష్ణ, వైద్యులు చంద్రశేఖర్, చేతన్, రవికాంత్, సభ్యులు గోపి, సుబ్బారావు, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులకు వందనం



కనిగిరి: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, సీఐ ఖాజావలి, ఎస్సై శ్రీరామ్ తదితరులు

కనిగిరి, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం కనిగిరి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. దీనిని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు, శాంతి భద్రతలే లక్ష్యంగా అమరులైన పోలీస్ సిబ్బందికి నివాళులర్పిస్తూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు తెలిపారు. అనంతరం పామూరు బస్టాండ్‌లో మానవహారం నిర్వహించారు. సీఐ ఖాజావలి, ఎస్సై శ్రీరామ్, కళాశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ▶ పామూరు: పామూరులో పోలీసులు ప్రదర్శన నిర్వహించారు. అమరులైన పోలీసుల గురించి వివరించి వారికి నివాళులర్పించారు. ఏఎస్సై ముల్లా, కూటమి నేతలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ▶ సింగరాయకొండ గ్రామీణం: సింగరాయకొండ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. విధి నిర్వహణ, పోలీసుల త్యాగాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్సైలు మహేంద్ర, నాగమల్లేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు. ▶ దొనకొండ: దొనకొండలోని గౌతమి డిగ్రీ కళాశాలలో ‘సమాజంలో పోలీసు పాత్రపై’ వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ రామయోగి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించారు. ▶ కొండపి గ్రామీణం: కొండపి సర్కిల్ పరిధిలోని సిబ్బంది విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎస్సైలు ప్రేమ్‌కుమార్, రమేష్ బాబు, అనూక్, సిబ్బంది పాల్గొన్నారు.



సింగరాయకొండలో విద్యార్థులతో మానవహారం నిర్వహిస్తున్న పోలీసులు

అవీ... ఇవీ... అన్నీ...

రూ. 1.9 కోట్లతో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

పీసీపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన పీసీపల్లిలో బ్యాంకు కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సిమెంట్ రహదారి నిర్మాణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. రూ.1.90 కోట్లను ఇందుకు మంజూరు చేశారు. అధికారుల సమక్షంలో గుత్తేదారు పనులు మొదలు పెట్టారు.

తగ్గిన వరద ఉధృతి: రాకపోకల పునరుద్ధరణ

ముండ్లమూరు: మండలంలోని మారెళ్ల గ్రామ సమీపంలోని ఈదరవాగు ఉధృతి సోమవారం తగ్గుముఖం పట్టింది. చప్టాపై నుంచి అడుగు మేర మాత్రమే నీరు ప్రవహిస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో రాకపోకలకు అనుమతి ఇచ్చారు. ఇరువైపులా ఏర్పాటు చేసిన చిల్లకంపను తొలగించారు.

నారాయణ స్వామి ఆలయ ఆదాయం రూ.1.01 లక్షలు

సి.ఎస్.పురం: ప్రసిద్ధి గాంచిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ఆదివారం ఆదాయం రూ.1,01,524 వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.నరసింహబాబు తెలిపారు. స్వామి వారి దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.41,800, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.22,760, శాశ్వత అన్నదాన పథకానికి రూ.25,948, ఇతర విరాళాలు రూ.11,016 వచ్చినట్లు పేర్కొన్నారు.

భైరవకోనలో ఏకేయూ ఉప కులపతి పూజలు

సి.ఎస్.పురం: శైవ పుణ్యక్షేత్రం భైరవకోనలో సోమవారం ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఉప కులపతి డీవీఆర్ మూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలభైరవేశ్వరస్వామి, త్రిముఖ దుర్గాంబలను దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది, అర్చకులు స్వామి వారి శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

జీవాలకు నట్టల నివారణ మందు

తాళ్లూరు: తాళ్లూరులో సోమవారం ఉదయం గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణా మందులు పంపిణీని మండల పశు వైద్యాధికారి వి.ప్రతాపరెడ్డి ప్రారంభించారు. ఈ సదవకాశాన్ని జీవాల పోషకులంతా ఉపయోగించుకోవాలని సూచించారు. 500 జీవాలకు నట్టల నివారణా మందులు తాగించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

కొండపి గ్రామీణం: సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో రామాంజనేయులు హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గృహ నిర్మాణ శాఖ ద్వారా చేపట్టిన ఇళ్లు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.

సాగులో మేలైన పద్ధతులు అవసరం

పామూరు: రైతులు పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏవోలు కె.రాధ, శిల్పలు తెలిపారు. మండలంలోని దూబగుంట్ల, సి.ఎస్.పురం మండలంలోని రేగులచెలక గ్రామాల్లో సోమవారం యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా కంది సాగు చేపట్టిన రైతుల భూములను పరిశీలించారు.

రోడ్లపై పశువుల తరలింపు: యజమానులకు జరిమానా

దర్శి: నగరపంచాయతీ పరిధిలో రోడ్లపై తిరుగుతున్న పశువులను కురిచేడు రోడ్డులోని సచివాలయ ఆవరణలోనికి సోమవారం తరలించారు. యజమానులకు రూ.21 వేల అపరాధ రుసుం విధించినట్లు కమిషనర్ మహేష్ తెలిపారు.

కుండపోత వర్షం



ఇందిరా కాలనీలోని ఓ ఇంట్లోకి వచ్చిన వర్షపునీరు

కనిగిరి పట్టణంలో సోమవారం సాయంత్రం అరగంటకు పైగా కుండపోత వర్షం కురిసింది. పెద్దగా ఉరుములు, మెరుపులతో వచ్చిన వాన పట్టణాన్ని ముంచెత్తింది. దీంతో వీధులన్నీ జలమయ్యాయి.. రాకపోకలు నిలిచి పోయాయి. శివారు ప్రాంతాలైన శివనగర్ కాలనీ, ఎన్జీవో కాలనీ, బీసీ కాలనీ, బొగ్గుల గొంది కాలనీల్లో గృహాల్లోకి సైతం నీరు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

–న్యూస్‌టుడే, కనిగిరి



జలమయమైన బొడ్డు చావిడి సెంటర్

అన్నదాతకు తప్పని నష్టం

ఇటీవల కురిసిన వానలతోపాటు సోమవారం దర్శి మండలంలో కురిసిన భారీ వర్షానికి పత్తి, మిరప, పొగాకు, దానిమ్మ, బొప్పాయి వంటి పంటలు నీట మునిగి తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. పత్తి తీసే సమయంలో వర్షం రావడంతో తడిసి నల్లగా మారింది. మండలంలో దాదాపు అయిదు వందల ఎకరాల్లో పత్తి సాగు చేసిన రైతులు ఎకరానికి రూ. 25 వేల నుంచి రూ.30 వేల వరకు నష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు. పలు గ్రామాల్లో కోసిన సజ్జ కంకుల నుంచి మొలకలొచ్చాయి. మండలంలోని చందలూరు, చలివేంద్ర, వెంకటాచలంపల్లి, మారెడ్డిపల్లి గ్రామాల్లో రైతులు ఉద్యాన పంటలు సాగు చేశారు. వర్షాల వల్ల తెగుళ్లబారిన పడ్డాయని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వమే తమను కాపాడాలని రైతులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, దర్శి



మారెడ్డిపల్లిలోని మిరపతోటలో నిలిచిన నీరు

ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ



కనిగిరిలో దివ్యాంగుడి నుంచి అర్జీ స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో అధికారులు నాయకులకు తొత్తులుగా మారి పలు అవకతవకలకు పాల్పడం వల్లే ఇన్ని రెవెన్యూ సమస్యలు వచ్చాయని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మండిపడ్డారు. సోమవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. కనక పట్టణంలో మద్యం దుకాణం వద్దని, ఉస్తుంవారిపల్లిలో చెరువు తూములు దెబ్బతిన్నాయని, శంకవరం ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు తమ భూమిని వేరొకరికి అప్పగించారని, యడవల్లికి చెందిన కొందరు ప్రభుత్వం ఇచ్చిన భూమిని వైకాపా నేతలకు అధికారులు రాసిచ్చారని, ఎన్.గొల్లపల్లిలో అసైన్డ్ భూములు, శ్మశాన వాటికలను వైకాపా నాయకులు కాజేశారని, వంగపాడులో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయాలని, టకారిపాలెంలో వాగు ఆక్రమణకు గురైందని తదితర సమస్యలపై ప్రజలు వినతులు అందించారు. మొత్తం 207 అర్జీలు రాగా అత్యధికంగా 108 రెవెన్యూ సమస్యలపైనే వచ్చాయి. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో శ్రీనివాసులరెడ్డి, ఎండీడీవో హనుమంతరావు, తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.డానియెల్ జోసెఫ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

▶ హనుమంతునిపాడు: హెచ్‌ఎంపాడులో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ప్రజాదర్బార్‌లో 165 అర్జీలు అందాయి. పలు గ్రామాల నుంచి రైతులు ఆన్‌లైన్‌లో తప్పిదాలపై భారీగా వినతులు అందజేశారు. గొల్లపల్లికి చెందిన పేరూరి వెంకటేశ్వర్లు అనే దివ్యాంగ యువకుడు రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరారు. లింగంగుంట్ల గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు జగనన్న కాలనీలో ఇచ్చిన స్థలాన్ని ఆక్రమించి అమ్ముకున్నారని, అటవీ భూమిని అక్రమించి జామాయిల్ నాటారని, గ్రామంలో సీసీ రోడ్లు వెయ్యకుండానే బిల్లులు చేసుకున్నారని గ్రామస్థులు ఎమ్మెల్యేకు వివరించారు. ఎంపీడీవో ఎం.రంగసుబ్బారాయుడు, డీటీ కిశోర్‌రెడ్డి, డిప్యూటీ డీఈవో చంద్రమౌళిస్వరరావు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు. ▶ తాళ్లూరు: మండలంలోని నాగంబొట్లపాలెంలో పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్నందువల్ల ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తహసీల్దారు కె.నాగలక్ష్మికి తాళ్లూరుకు చెందిన చందోలు రామారావు వినతిపత్రం అందజేశాడు. తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో ఎంపీడీవో కె.సుందరరామయ్య, డీటీ ఇమ్మానియేలు రాజు, ఎంఈవో జి.సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రేగులచెలకలో భూముల సర్వే

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: మండలంలోని రేగులచెలకలోని 224 సర్వే నంబరులో భూముల సర్వేని సోమవారం ప్రారంభించినట్లు తహసీల్దార్ డి.మంజునాథరెడ్డి తెలిపారు. ఈ భూముల్లో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే రహదారి నిర్మించనున్నట్లు చెప్పారు. భూములను ప్రస్తుతం సాగుచేయకపోవడం వల్ల నంబరులో రైతుల హక్కును నిర్ధారించేందుకు సర్వే చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. వారం రోజుల పాటు సర్వే జరుగుతుందని 224 సర్వే నంబరులో భూములు కలిగిన రైతులు తమ ధ్రువపత్రాలను తీసుకొచ్చి సర్వేయర్లకు గట్లు తెలిపి సహకరించాలని కోరారు. మండలంలో రీసర్వే జరిగిన గ్రామాల్లో ఈ నెల 23 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ▶ తాళ్లూరు: గత వైకాపా ప్రభుత్వంలో భూ రీసర్వే పూర్తి చేసిన గ్రామాల్లో ఈ నెల 22 నుంచి వచ్చే నెల అయిదో తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు కె.నాగలక్ష్మి తెలిపారు.

అనధికారిక పొగాకు సాగు వద్దు

టంగుటూరు, న్యూస్‌టుడే: రైతులు అనధికారికంగా పొగాకు పంటను సాగు చేయరాదని, ప్రత్యామ్నాయ పంటలను కూడా పండించాలని టంగుటూరు పొగాకు బోర్డు వేలం కేంద్ర నిర్వాహకుడు అట్లూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బోర్డు పరిధిలోని రైతులతో పొగాకు నియంత్రణపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. 2024-25 పంట కాలానికి బ్యారన్‌కు 2.22 హెక్టార్లు మాత్రమే సాగు చేయాలని సూచించారు. బ్యారన్‌కు 4,175 కేజీలకు మాత్రమే అనుమతి లభించిందన్నారు. రైతులు అనధికారికంగా బ్యారన్‌లు నిర్మిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్త్రీనిధి బకాయిలు వసూలు చేయాలి

తాళ్లూరు: స్త్రీనిధి బకాయిలను వేగవంతంగా వసూలు చేయాలని వెలుగు పథకం దర్శి ప్రాంతీయ సమన్వయకర్త వసుంధరాదేవి సూచించారు. తాళ్లూరు మండలం నుంచే ఇంకా రూ. 20 లక్షల మేరకు రావాల్సి ఉందన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన వీవోఏల సమావేశంలో మాట్లాడారు. ఫిజియోథెరపిస్టు సంతోష్ కుమార్ ఫిజియోథెరపి వల్ల కలిగే ప్రయోజనాలపై ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. ▶ కనిగిరి, న్యూస్‌టుడే: మహిళలు వ్యాపార రంగంలో రాణించాలని మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ పేర్కొన్నారు. సోమవారం పులి వెంకటరెడ్డి పార్కు వద్ద మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను ప్రారంభించారు.

విద్యార్థుల భోజనంలో మెనూ తప్పనిసరి

కొండపి గ్రామీణం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ మురళి ఆదేశించారు. మండలంలోని మూగచింతల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టీ పరిశీలించారు. గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి దస్త్రాలను పరిశీలించారు. అక్కడ అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధ్వాన మార్గం.. అవస్థల ప్రయాణం

న్యూస్‌టుడే, దర్శి

వైకాపా అయిదేళ్ల పాలనలో రహదారుల గురించి పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కురిచేడు నుంచి దొనకొండ వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలమయమై వాహనదారులు ఇబ్బందుపాలవుతున్నారు. దాదాపు పది గ్రామాల ప్రజలు నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో ప్రమాదకర పరిస్థితుల్లోనే ప్రయాణాలు సాగిస్తున్నారు. పొట్లపాడు సమీపంలో అడుగడుగునా గుంతలతో వర్షాలు కురిసిన సమయంలో నీళ్లు చేరుతున్నాయి. ◆ దర్శి మండలం బండివెలిగండ్ల నుంచి గంగపాలెం వెళ్లే మార్గం కంకర వేసిన అనంతరం పట్టించుకోలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పల్లె పండుగ కార్యక్రమంలో రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

◆ దర్శిలోని లంకోజనపల్లి మార్గంలో రోడ్డుపైకి నీరు పారుతూ రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ మార్గంలో తూర్పువెంకటాపురం, లంకోజనపల్లి, ఎర్రఓబనపల్లి, గణేషునిపురం, బండివెలిగండ్ల తదితర పది గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగించటంతో పాటు మార్కాపురం, దొనకొండ మండలంలో పలు గ్రామాలకు వెళ్లటానికి ఇది దగ్గరిదారి. వర్షపునీరు వెళ్లే మార్గం లేక, సైడు కాలువలు లేనందున రోడ్డుపైనే నీరు పారుతుంది. సాగర్ ప్రధాన కాలువ పైఎత్తున ఉండడంతో ఊట ద్వారా నీరు రావడం, పంట కాలువలకు వదిలిన నీరు రోడ్డుపైకి వస్తుండడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అధిక మొత్తంలో నీరు పారడంతో వాహనాలు వచ్చే సమయంలో పాదచారులపై నీరు చిమ్మి తీవ్ర అసౌకర్యం ఏర్పడుతుందని వాపోతున్నారు. దీనిపై నగర పంచాయతీ కమిషనర్ మహేష్‌ను వివరణ కోరగా పొలాల్లోకి వెళ్లాల్సిన నీరు రావడంతో అది రోడ్డుపైకి చేరుతుందని, సైడు కాలువలు నిర్మించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.



గుంతలమయమైన కురిచేడు– దొనకొండ ఆర్‌అండ్‌బీ రోడ్డు

ఒంగోలు

•ఒంగోలు •సంతనూతలపాడు

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

చీమకుర్తి, న్యూస్‌టుడే: నిర్వహణ పనుల కారణంగా పి.నాయుడుపాలెం ఉప కేంద్రం పరిధిలోని గ్రామాలకు మంగళవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. పి.నాయుడుపాలెం, పాటిమీదపాలెం, బండ్లమూడి, మంచికలపాడు, టి.గుడిపాడు, వై.గుడిపాడు, చీమలమర్రి ప్రాంతాలకు సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

పరివర్తకాల మార్పు... : ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు ఉపకేంద్రంలోని పరివర్తకాల మార్పు కారణంగా... మంగళ, బుధవారాల్లో ఒంగోలులోని 132/33 కేవీ ఉపకేంద్రం నుంచి మేదరమెట్లకు విద్యుత్తు సరఫరా జరుగుతుందని ఈఈ ఎం.హరిబాబు తెలిపారు. ఈ క్రమంలో ఎక్కడైనా సరఫరాలో అంతరాయం తలెత్తే అవకాశం ఉన్నందున... వినియోగదారులు సహకరించాలని ఓ ప్రకటనలో కోరారు.

నకిలీ నోట్లతో కారు డ్రైవర్‌కు టోకరా

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే నకిలీ నోట్లతో కారు డ్రైవర్‌కు టోకరా ఇచ్చాడో వ్యక్తి. ఒంగోలులో సోమవారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరుకు చెందిన వెల్లాల శ్రీనివాసరావు కారు డ్రైవర్. సోమవారం సాయంత్రం... ఓ వ్యక్తి ఆయన వద్దకు వచ్చి ఒంగోలుకు కారు బాడుగ మాట్లాడుకున్నారు. ఒంగోలులోని ఓ రెస్టారెంట్‌కు వెళ్లిన సదరు వ్యక్తి... తనతో పాటు డ్రైవర్‌ను తీసుకెళ్లాడు. రూ.ఏడు వేలు ఫోన్ పే చేస్తే ఆ మేరకు నగదు ఇస్తానని చెప్పడంతో... డ్రైవర్ శ్రీనివాసరావు ఆ వ్యక్తి చెప్పిన నంబర్‌కు నగదు పంపారు. బదులుగా ఆ వ్యక్తి 14 రూ.500 నోట్లు ఇచ్చాడు. ఒక్క కాల్ చేసుకుంటా ఫోన్ కావాలని అడగడంతో శ్రీనివాసరావు తన సెల్‌ఫోన్ ఇచ్చాడు. కాసేపటి తర్వాత ఫోన్ మూగబోయింది. ఏం జరిగిందని ఆరాతీస్తే సదరు వ్యక్తి ఇచ్చిన నోట్లు జిరాక్స్ కాపీలని తేలింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఒంగోలు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

కీలక మార్గం... అయిదేళ్లుగా నిర్లక్ష్యం



సినిమాహాలు సమీపంలో రహదారి దుస్థితి



బైపాస్ తూర్పు వైపు కూడలిలో ఇలా...

చీమకుర్తి బైపాస్ రహదారి కూడళ్లు, పట్టణ శివారులోని సినిమా హాలు ప్రాంతంలో గోతులు ఏర్పడి రాకపోకలకు వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. గత అయిదేళ్లుగా కనీస మరమ్మతులు చేపట్టకపోవడం... నిత్యం భారీ గ్రానైట్ వాహనాలు, కంకర, మట్టి టిప్పర్లు తిరుగుతుండడంతో రోడ్డు పూర్తిగా రూపుకోల్పోయింది. సమస్య ఇంత తీవ్రంగా ఉన్నా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అనుమతి ఇస్తే తాము మరమ్మతులు చేయిస్తామంటూ కొందరు గ్రానైట్ యజమానులు గతంలో ప్రకటించారు. వారి తోడ్పాటుతోనైనా పనులు జరిగేలా చొరవ చూపాల్సిన అవసరం ఉంది. చీమకుర్తి - మర్రిచెట్లపాలెం మధ్య సమస్య తీవ్రంగా ఉన్నందున వెంటనే... రహదారి బాగుకు కార్యాచరణ రూపొందించాలని వాహనదారులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, చీమకుర్తి

భాగ్యనగర్‌లో సమస్యల తిష్ఠ



నాలుగో లైన్‌లో...



రెండో లైన్‌లో పరిస్థితి

నగరంలోని 19వ డివిజన్ పరిధి భాగ్యనగర్‌లో మురుగు సమస్య పెరిగి నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొత్తం నాలుగు లైన్లలో కాలనీ విస్తరించి ఉంది. అయిదేళ్లుగా కాలువల బాగును పట్టించుకోపోవడంతో చాలా వరకు పూడిపోయాయి. ఇటీవలి వర్షాలకు అవి పొంగి రహదారులపైనే మురుగు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు ముఖ్యంగా ఈ ప్రాంతం నుంచి వరద బయటకు పోయే మార్గం లేకపోవడం సమస్యగా మారింది. నాలుగో లైన్‌లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఇళ్ల ముందే మురుగు పేరుకుపోవడంతో దుర్వాసన వెలువడుతోందని, అంతర్గత రహదారి నిర్మాణం చేపట్టక గుంతల మార్గంలోనే ప్రయాణాలు సాగిస్తున్నామని స్థానికులు వాపోతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్యరోడ్డు

గుంతల దారితో చింత



అంజయ్యరోడ్డు నుంచి నిర్మల్‌నగర్‌కు వెళ్లే రహదారిలో రంగరాయుడు చెరువు వద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల వర్షాలకు వాటిలో నీరు చేరడంతో... అటుగా రాకపోకలకు వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇటుగా వాహ్యాళికి వచ్చే వాకర్లు సైతం ఇబ్బంది పడుతున్నారు. గుంతల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నిర్మల్‌నగర్ (ఒంగోలు అంజయ్యరోడ్డు)

17న కాపు వన భోజన మహోత్సవం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: పెళ్లూరు రోడ్డులోని డీ-6 ఫంక్షన్ హాలులో నవంబరు 17న నిర్వహించనున్న కాపు వన భోజన మహోత్సవాన్ని జయప్రదం చేయాలని కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ విజ్ఞప్తి చేశారు. రామనగర్‌లోని సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సభ్యులంతా వేడుకలో పాల్గొనాలని కోరారు. నాయకులు టి.శ్రీనివాసమూర్తి, యు.శ్రీనివాసరావు, రాజ్‌కుమార్, మిరియాల వెంకటేశ్వర్లు, మేకల నారాయణ, టి.వెంకటరావు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: ఎయిడ్స్ నియంత్రణ, హెల్ప్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సోమవారం... నాగులుప్పలపాడు ఉన్నత పాఠశాలలో ఎయిడ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఏంఈవోలు రవి, రమణయ్య మాట్లాడుతూ... ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష కూడదని తెలిపారు. వారి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కల్పిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించారు. ప్రజల్లో ఉన్న అపోహలు, హెచ్ఐవీ నియంత్రణ తదితర అంశాలపై ప్రాజెక్టు డైరెక్టర్ సాగర్ అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు అంజిరెడ్డి, పీడీ శ్రీలత, సంస్థ ప్రతినిధులు మల్లీశ్వరి, దివ్య, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సృజనకు పదును



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు



విజేతలతో కరస్పాండెంట్ వంశీకృష్ణ, ఉపాధ్యాయులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: కర్నూలు రోడ్డులోని జూపిటర్ హైస్కూల్‌లో సోమవారం... 'ఈనాడు' ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఇంటర్నెట్ వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అన్న అంశంపై నిర్వహించిన పోటీల్లో... 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొని తమ ఆలోచనలకు అక్షర రూపం ఇచ్చారు. పదో తరగతి విద్యార్థులు టి.ధనలక్ష్మి... ప్రథమ; ఐ.మహేష్... ద్వితీయ; తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎస్.అపరంజి... తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి పాఠశాల కరస్పాండెంట్ ఆలూరు వంశీకృష్ణ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రిన్సిపల్ భార్గవి, ఉపాధ్యాయులు సుమలత, దుర్గ, మారుతి పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య మద్యం దుకాణాలు వద్దని నిరసన

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: నివాసాల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకుండా చూడాలని ఐద్వా మండల కార్యదర్శి ఎన్.మాలతి డిమాండ్ చేశారు. ఈ మేరకు సంతనూతలపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. విద్యాలయాలు, దేవస్థానాలు ఉన్న ప్రాంతంలో ఏర్పాటుకు అనుమతులు నిరాకరించాలన్నారు. తహసీల్దార్ వి.ఆదిలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. జేవీవీ జిల్లా నాయకుడు కోదాటి కోటేశ్వరరావు, రమణమ్మ, కోటిరత్నం, వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు, విశ్వం, శ్రీమన్నారాయణ, టి.ప్రభుదాసు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. * పెద్ద బజారులో ఇళ్ల మధ్య ఏర్పాటుచేస్తున్న మద్యం దుకాణాన్ని ఆపాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కాజా మొహిద్దీన్, ఎస్సై అజయ్‌బాబుకు వినతి పత్రం అందజేశారు.

కార్మికులపై కక్ష సాధింపులు తగవు

చీమకుర్తి, న్యూస్‌టుడే: మున్సిపల్ కార్మికులపై రాజకీయ కక్ష సాధింపులు ఆపాలని, సమ్మె సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని చీమకుర్తి మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. సీఐటీయూ నాయకులు పూసపాటి వెంకట్రావు మాట్లాడుతూ రాజకీయ కారణాలతో పురపాలక సంఘాల్లో నిలిపేస్తున్న కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.ఏడుకొండలు, పి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

దాతల తోడ్పాటు... ఊటబావి ఏర్పాటు



ప్రారంభోత్సవంలో పాల్గొన్న దాతలు

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధికి దాతల తోడ్పాటు అభినందనీయమని సర్పంచి వైకుంఠ పద్మశ్రీ వీరాంజనేయులు పేర్కొన్నారు. మద్దిరాల పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి గ్రామానికి చెందిన ఏలూరి చక్రపాణి, అలివేలమ్మ దంపతుల కుమారులు భవానీశంకర్, వెంకటేష్... సుమారు రూ.8 లక్షల వ్యయంతో చెరువులో ఊట బావి నిర్మించారు. సోమవారం దీనిని ప్రారంభించారు. ఈ బావి ఏర్పాటుతో నీటి ఎద్దడి అన్న సమస్య ఉండదని పేర్కొన్నారు. దాతలను అభినందించారు. గ్రామస్థులు పుచ్చకాయల వెంకటేశ్వర్లు, వెంకటేష్, కంద్లగుంట శ్రీనివాసరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, వేణుబాబు, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాలనీలోకి వరద పోటెత్తుతోంది

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడులో చెరువు నిండిన ప్రతిసారీ ఎస్సీ కాలనీలోకి నీరు చేరడంతో ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీవాసులు జేసీ గోపాలకృష్ణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ప్రస్తుత వర్షాలకు సమస్య తారస్థాయికి చేరిందన్నారు. జాతీయ రహదారి వెంబడి కాలువలు బాగు చేయడంతో పాటు అవసరమైన చోట కల్వర్టులు ఏర్పాటు చేయాలని కోరారు.

ట్రూఅప్ విధానం సరికాదు

చీమకుర్తి, న్యూస్‌టుడే: ప్రజలపై మోయలేని విద్యుత్తు భారానికి కారణమవుతున్న ట్రూ అప్ విధానాన్ని రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ కోరారు. పంగులూరి కృష్ణయ్య భవనంలో సోమవారం నిర్వహించిన చీమకుర్తి మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. డిస్కంల ప్రతిపాదనలు, సంస్కరణలపై పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 30న జరిగే మండల మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఎస్కే మాబు, కంకణాల ఆంజనేయులు, పమిడి వెంకట్రావు, పూసపాటి వెంకట్రావు, కాలం సుబ్బారావు, పల్లాపల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ నవీకరణ శిబిరాలు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: ఆధార్ నవీకరణకు సంబంధించి సంతనూతలపాడు మండలంలో మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. 22, 23 తేదీల్లో ఎం.వేములపాడు, రుద్రవరం; 24న బొడ్డువారిపాలెం, ఎండ్లూరు; 25న ఎనికపాడు, ఎండ్లూరు సచివాలయాల పరిధిలో ఇవి కొనసాగుతాయని ఆ పరిధిలోని గ్రామాల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రీసర్వే తప్పులు సరిదిద్దేందుకు గ్రామసభలు

మద్దిపాడు, న్యూస్‌టుడే: భూముల రీసర్వే కారణంగా తలెత్తిన చిక్కుల పరిష్కారానికి మంగళవారం నుంచి నవంబరు 8 వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుజన్‌కుమార్ తెలిపారు. 22న నందిపాడు, 23న గార్లపాడు, 24న మద్దిపాడు, 25న నేలటూరు, 26న దొడ్డవరప్పాడు, 29న గుండ్లాపల్లి, 30న కీర్తిపాడు, నవంబరు 5న వెల్లంపల్లి, 6న సీతారామపురం, 7న దొడ్డవరం, 8న వెంకటేశ్వరపురం (మల్లవరం)లో ఇవి జరుగుతాయన్నారు. ఈ సభలతో పాటు... వచ్చే నెల 15 వరకు వినతులు స్వీకరించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

4 నుంచి డీఈఐఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు డీఈఐఈడీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నవంబర్ 4 నుంచి 7 వరకు రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సామా సుబ్బారావు తెలిపారు. రెగ్యులర్ వారితో పాటు... ఒకసారి ఫెయిలైన వారు (2021-23, 2022-24 బ్యాచ్‌లు) పరీక్షలు రాయవచ్చన్నారు. మొదటి సంవత్సరం వారికి నవంబర్ 4 నుంచి 9 వరకు మధ్యాహ్నం వేళ పరీక్షలు ఉంటాయన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఒంగోలు నగరం: 8008574067 ఒంగోలు గ్రామీణం : 8008564455

ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766

ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే:

?: ఒంగోలు - కొత్తపట్నం రోడ్డులో ఇందిరమ్మ ఇళ్ల నుంచి కొప్పోలు వరకు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇక్కడ తవ్విన కచ్చా కాలువ కారణంగా సమస్య మరింత పెరిగింది. సమీప పొలాల్లోని వరద సైతం రోడ్డుపైకి చేరుతోంది. – దుర్గ, స్థానిక మహిళ

✓: కొప్పోలు వైపుగా కచ్చా కాలువ తవ్వేందుకు ప్రయత్నించగా... ఖబరస్థాన్ వద్ద అభ్యంతరాలు తలెత్తాయి. కొప్పోలు కాలువకు దీనిని అనుసంధానించేలా ప్రతిపాదన పెట్టాం. ప్రస్తుతానికి అక్కడ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. – ఎన్.పిచ్చయ్య, శానిటరీ సూపర్‌వైజర్

మద్దిపాడు, న్యూస్‌టుడే:

?: ఘడియాపూడి పునరావాస కాలనీ - మద్దిపాడు మార్గంలోని రక్షిత నీటి పథకం ట్యాంకు వద్ద వర్షం నీరు నిలిచి దుర్వాసన వెలువడుతోంది. – ఎ.సత్యనారాయణ, ఘడియాపూడి

✓: నిలిచిన నీటిని బయటకు తరలించి... ఆ ప్రాంతాన్ని బాగు చేయిస్తాం. – జె.శ్వేత, పంచాయతీ కార్యదర్శి



?: మద్దిపాడు ఉన్నత పాఠశాల ప్రహరీ పక్కనే చెత్త పారబోస్తుండడంతో ఆ ప్రాంతం డంపింగ్ యార్డులా మారింది. వర్షాలకు వ్యర్థాలు కుళ్లి పరిస్థితి మరింత దిగజారింది. – వేల్పుల నాగరాజు, గ్రామస్థుడు

✓: సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేయించి... ఆ ప్రాంతంలో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటాం. – నూరుల్లా, పంచాయతీ కార్యదర్శి

వెలిగిన వీధి దీపం

స్పందనకు వందనం

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: విజయనగర్ కాలనీ మూడో లైన్‌లో రెండు నెలలుగా వీధి దీపం వెలగడం లేదు. ఇక్కడ నెలకొన్న సమస్యలపై 'విజయనగర్ కాలనీ... వసతులకు దూరం' శీర్షికన 'ఈనాడు'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం ఆ ప్రాంతంలో కొత్త దీపం ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించారు.

సాగు నీటి సంఘాలకు ఊపిరి

న్యూస్‌టుడే – ఒంగోలు గ్రామీణం, కొత్తపట్నం

- ఎన్నికల ప్రకటన విడుదల చేసిన ప్రభుత్వం



వ్యర్థాలు, పిచ్చిమొక్కలతో నిండిన త్రోవగుంట మేజర్

అయిదేళ్ల వైకాపా పాలనలో నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురైన సాగునీటి సంఘాలకు కూటమి ప్రభుత్వం ఊపిరిలూదుతోంది. జలవనరుల నిర్వహణను పర్యవేక్షించే ఈ సంఘాలను మళ్లీ క్రియాశీలకంగా మార్చేందుకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం వచ్చే నెల 21 నుంచి 26 వరకు ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తోంది. సంబంధిత ప్రకటనను జలవనరులశాఖ అధికారులు సోమవారం విడుదల చేశారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం తొలిసారిగా నిర్వహిస్తున్న కార్యక్రమం కావడంతో పల్లెల్లో సందడి నెలకొంది.

జలవనరుల సంరక్షణలో కీలకం...

పంట కాలువల అభివృద్ధి, నీటి సరఫరా తీరుతెన్నులు పర్యవేక్షించడంతో పాటు, ఆయకట్టు పరిధిలో ఏ సమస్య వచ్చినా సాగునీటి సంఘాలే బాధ్యతాయుతంగా వ్యవహరించేవి. తెదేపా ప్రభుత్వ హయాంలో చివరిసారిగా 2015లో వీటికి ఎన్నికలు నిర్వహించారు. నీరు-చెట్టు, ఇతర నిధులతో సాగు నీటి వనరులను అభివృద్ధి చేసుకున్నారు. వీరి పదవీ కాలం పూర్తయ్యాక అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో సాగు నీటి వనరుల నిర్వహణ గాడి తప్పింది. పంట కాలువలన్నీ పూడికలతో నిండిపోయి రూపుకోల్పోయాయి.

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నాలుగు నెలల్లోనే వీటి ప్రాధాన్యం గుర్తించి ఎన్నికల నిర్వహణకు శ్రీకారం చుట్టింది.

గాలికొదిలేసిన గత ప్రభుత్వం...

జిల్లాకు సాగర్ నీరు వస్తే ముందుగా రామతీర్థం జలాశయాన్ని నింపుతారు. అనంతరం ఓబీసీ ద్వారా నగరపాలక సంస్థకు చెందిన రెండు వేసవి చెరువులు; ఒంగోలు, కొత్తపట్నం, సంతనూతలపాడు, మద్దిపాడు, టంగుటూరు మండలాల పరిధిలోని సాగు, తాగునీటి చెరువులను ప్రాధాన్యతా క్రమంలో నింపుతారు. ఈతముక్కల, కొప్పోలు, త్రోవగుంట మేజర్లు, అల్లూరు మైనర్ తదితర కాలువల ద్వారా ఈ ప్రక్రియ సాగుతుంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న కాలువల నిర్వహణను గత అయిదేళ్లుగా గాలికొదిలేశారు. కనీస మరమ్మతులూ లేక తూములు, డ్రాపులు దెబ్బతిన్నాయి. చిల్లచెట్లు పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. కొత్త సంఘాలు కొలువుదీరితే వీటి రూపురేఖలు మారే అవకాశం ఉంది.

మొత్తం 56 సంఘాలు...

ఒంగోలు నియోజకవర్గంలో 3 మైనర్లు, 10 మేజర్లు; సంతనూతలపాడులో 13 మైనర్లు, 30 మేజర్లకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 22 నుంచి 31 వరకు వీటి పరిధిలోని ఓటర్ల వివరాలు సేకరిస్తారు. 31న ఆ వివరాలు ప్రదర్శిస్తారు. నవంబర్ 21-23 మధ్య నీటి వినియోగదారుల సంఘాల సభ్యులు, అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ చేపడతారు. 24-26 మధ్య నీటి పంపిణీ కాలువల పరిధిలో ఎన్నికలు నిర్వహిస్తారు. మొత్తం ప్రక్రియను కలెక్టర్ పర్యవేక్షిస్తారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఈ మేరకు మండల స్థాయి అధికారులతో సోమవారం రాత్రి వీక్షణ సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ, తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టాలన్నారు. జ్వరాలు ప్రబలకుండా దోమల నివారణపై దృష్టి సారించాలన్నారు. ఫీవర్ సర్వే వెంటనే పూర్తి చేయాలన్నారు. డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్, జడ్పీ సీఈవో చిరంజీవి, డీపీవో జీవీ.నాయుడు పాల్గొన్నారు.

● 'బంగారు బాల్యం' కార్యక్రమం అమలపై జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారిణి మాధురి, కార్మిక శాఖ ఉప కమిషనర్ గాయత్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆలయం అభివృద్ధికి చేయూత



విరాళం చెక్కు అందజేస్తున్న రాధాకృష్ణమూర్తి

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి ప్రధాన రహదారిలోని అభయాంజనేయ స్వామి దేవస్థానం అభివృద్ధికి విశ్రాంత ప్రధానాచార్యుడు గుద్దంటి రాధాకృష్ణమూర్తి రూ.లక్ష విరాళం అందజేశారు. సంబంధిత చెక్కును ఆలయ కమిటీ అధ్యక్షుడు పుత్తూరి ఆంజనేయులుకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతను సత్కరించారు. అర్చకులు శేష శ్రీధర్‌శర్మ, కార్యదర్శి సాంబశివరావు, నారాయణ వెంకట్రావు, జి.పవన్ కుమార్, దొంతు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ట్రేడ్ పరీక్షలు ప్రారంభం

చీమకుర్తి, న్యూస్‌టుడే: గ్రానైట్ గనుల్లో నవంబరు నాలుగు నుంచి ప్రారంభం కానున్న భద్రతా వారోత్సవాల్లో భాగంగా... వివిధ విభాగాలకు సంబంధించిన ట్రేడ్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. రామతీర్థంలోని వృత్తి శిక్షణ కేంద్రంలో నిర్వహించిన పరీక్షలకు వివిధ క్వారీలకు చెందిన సిబ్బంది, ఉద్యోగులు హాజరయ్యారు. కేంద్రం ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, వారోత్సవాల కమిటీ కార్యదర్శులు ఎ.రవి, గురువర్ధనరావు పరీక్షలను ప్రారంభించారు.

ఎంపీటీసీ సభ్యుడిపై చర్యలకు వినతి



డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైద్యాధికారులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: కొత్తపట్నం మండల కార్యాలయంలో ఈ నెల 18న జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో వైద్యాధికారిణి ఎం.వైష్ణవిని అసభ్య పదజాలంతో దూషించిన ఎంపీటీసీ సభ్యుడు ఆర్.వెంకటరావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ... కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్‌కు వైద్యాధికారులు సోమవారం వినతి పత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ ముగ్గురు అధికారులతో విచారణ కమిటీ వేసి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

గ్రానైట్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయండి



గనులశాఖ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న త్రీసీఎం గ్రానైట్ యజమానులు

ఒంగోలు, న్యూస్‌టుడే: గ్రానైట్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని, చీమకుర్తి నుంచి మర్రిచెట్లపాలెం వరకు ఒంగోలు - కర్నూలు రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని... కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించి మీకోసంతో పాటు భూగర్భ గనుల శాఖ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. అందరికీ ఆమోదయోగ్యమైన ధరలతో స్లాబులు సేకరించి, కచ్చితమైన బిల్లులతో ఎగుమతి చేయాలని తాము చేసుకున్న తీర్మానానికి తూట్లు పొడిచేలా కొందరు కొనుగోలుదారులు, పరిశ్రమల వారు వ్యవహరిస్తున్నారని... త్రీసీఎం గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. వారంతా సిండికేట్‌గా మారి చిన్నపరిశ్రమల వారిని బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి ప్రభుత్వ ఆదాయం పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ● ఇదే విషయమై ప్రజా సంకల్ప వేదిక అధ్యక్షుడు ఎం.రంగసాయిరెడ్డి గ్రీవెన్స్‌లో అర్జీ అందజేశారు.


కొత్తపట్నం: అమర వీరులకు నివాళులర్పిస్తున్న కోస్టల్ పోలీసు సిబ్బంది


సంతనూతలపాడు: బస్టాండ్ కూడలిలో మానవహారం

పోలీసు అమరవీరులకు నివాళి

పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని సోమవారం మండలంలో నిర్వహించారు. చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు, కొత్తపట్నం స్టేషన్ల పరిధిలో... విద్యార్థులు, వివిధ సంఘాల ప్రతినిధులతో కలిసి పోలీసులు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. విధి నిర్వహణలో అమరులైన వీరులకు నివాళులర్పించారు. వారి సేవలను స్మరించారు. ఆయా కార్యక్రమాల్లో సీఐ ఎం.సుబ్బారావు, ఎస్సైలు కృష్ణ, వి.అజయ్‌బాబు, శివరామయ్య, శ్రీకాంత్, మెరైన్ స్టేషన్ ఎస్సై సుబ్బారావు, రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు. - న్యూస్‌టుడే సిబ్బంది

ఒంగోలుకు రైలు హోటల్ కదిలొచ్చే..



ఒంగోలు రైల్వే స్టేషన్ వద్దకు లారీలో ఓ పాత బోగీ తీసుకొచ్చారు. విజయవాడ తదితర ప్రాంతాల్లో ఇప్పటికే బోగీ రెస్టారెంట్లు ఉన్నాయి. అలాంటి అనుభూతి ఒంగోలు వాసులకు చేరువ చెయ్యడంలో భాగంగా ఈ ఏర్పాట్లు చేస్తున్నారు.

-ఈనాడు, ఒంగోలు

వర్సిటీ విద్యార్థుల శ్రమదానం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: భారీ వర్షాలతో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ప్రాంగణంలో చేరిన వర్షపు నీటిని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శ్రమదానం ద్వారా తొలగించారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ అధికారి హర్షప్రీతమ్‌దేవ్ ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమం చేపట్టారు. మైదానంలో నిలిచిన నీటిని... కచ్చా కాలువల తవ్వకంతో బయటకు పంపారు. సిబ్బంది రమేష్, వైఎస్ రెడ్డి పాల్గొన్నారు.


జిల్లా జైలులో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా జడ్జి ఎ.భారతి

పేదలకు ఉచితంగా న్యాయ సహాయం

ఒంగోలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: క్షణికావేశంలో తప్పులు చేసి జైలు పాలైతే విలువైన జీవితం కోల్పోవడమే కాక తమవారికి తలవంపులు తెచ్చినట్లవుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి అభిప్రాయపడ్డారు. సోమవారం ఆమె జిల్లా జైలును సందర్శించారు. అక్కడి ఖైదీలకు అందుతున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. వారికి చట్టప్రకారం అందిస్తున్న సదుపాయాల గురించి ఆరా తీశారు. కారాగారంలోని ఖైదీలతో ముఖాముఖి మాట్లాడారు. న్యాయవాదిని నియమించుకోలేని పేదలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.శ్యాంబాబు, జైలు అధికారులు వి. రమేష్, ఎం.శ్రీనివాసరావు, జైలు వైద్యుడు బ్రహ్మతేజ, జైలుసిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా అంతర్ కళాశాలల పోటీలు


అంతర కళాశాల పోటీలు ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న దేవవరప్రసాద్

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని ఆంధ్రకేసరి విశ్వ విద్యాలయం ప్రిన్సిపల్ రాజమోహన్‌రావు అన్నారు. సోమవారం ఉమ్మడి ప్రకాశంలోని డిగ్రీ విద్యార్థుల అంతర కళాశాలల పోటీల ప్రారంభోత్సవంలో... కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించాలన్నారు. ఫిజికల్ డైరెక్టర్ ఎ.దేవవరప్రసాద్ మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఆ కోటా కింద ప్రవేశాలు లభిస్తాయన్నారు. మొత్తం 224 కళాశాలలుండగా సోమవారం బ్యాడ్మింటన్, షటిల్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. 30 కళాశాలల నుంచి 32 టీములు పాల్గొన్నాయి.

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల గడువు పొడిగింపు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి డీఎస్సీ ఉచిత శిక్షణ నిమిత్తం జ్ఞానభూమి వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి లక్ష్మానాయక్ తెలిపారు. డీఎస్సీ శిక్షణకు దరఖాస్తు చేసుకున్న వారికి మూడు నెలలపాటు ఉచిత శిక్షణ, భోజనం, వసతి సదుపాయం కల్పించనున్నట్లు ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అరటి తోట... లాభాల బాట



న్యూస్‌టుడే - ఒంగోలు కర్నూలు రోడ్డు

ఏళ్లుగా పసుపు సాగు చేస్తూ, పంట మార్పిడి చేస్తే బాగుంటుందన్న ఆలోచనతో అరటి తోట వేసి మంచి ఫలితాలు సాధిస్తున్నారు... కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామానికి చెందిన రైతు **దాసరి గోపాలరెడ్డి**. మొత్తం పది ఎకరాల్లో గత మూడేళ్లుగా అమృతపాణి రకం సాగు చేస్తున్నారు. పూర్తిగా సేంద్రియ పద్ధతులే అవలంబిస్తున్నారు.



ఓసారి నాటితే చాలు...: ముందుగా పొలాన్ని అరటి పిలకలు నాటేందుకు వీలుగా దుక్కులు దున్ని సిద్ధం చేశారు. కోనసీమ ప్రాంతం నుంచి ఒక్కోటి రూ.పది చొప్పున మొక్కలు తెచ్చారు. ఎకరాకు 12 వందల మేర నాటారు. వారానికి ఓసారి చొప్పున నీటి తడులు అందించారు. పోషక లోపం తలెత్తకుండా జీవామృతంతో పాటు... ఎప్పటికప్పుడు మొక్కల మొదళ్లలో పశువుల ఎరువు వేశారు. మూడు నెలలకు మొక్కలు కుదురుకుని... ఆరు నెలలకు గెలలు రావడం ప్రారంభమైంది. తొమ్మిది నెలలకు పూర్తిస్థాయిలో కోతకు వచ్చాయి. ఓసారి గెల కోశాక ఆ చెట్టును తొలగించాలి. అనుబంధంగా వచ్చే పిలకలే మళ్లీ మొక్కలుగా అభివృద్ధి చెందుతాయని రైతు తెలిపారు. అప్పటి నుంచి ఆరు నెలలకే ఫలసాయం చేతికి వస్తుందని వివరించారు. అలా మూడేళ్ల కాలంలో మొత్తం అయిదు సార్లు కోత కోసినట్లు చెప్పారు.

మంచి ఆదాయం...: తుపాన్లు, ఈదురు గాలులకు తోట ధ్వంసం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని... గెల బరువుకు చెట్టు విరిగిపోకుండా కర్రలను ఆధారంగా ఉంచాలని రైతు తెలిపారు. ఇప్పటి వరకు తెగుళ్ల సమస్య తలెత్తలేదని చెప్పారు. సీజన్‌ను బట్టి మార్కెట్‌లో ఒక్కో గెలకు రూ.మూడు వందల నుంచి రూ.నాలుగు వందల వరకు ధర లభిస్తోందన్నారు. అన్ని ఖర్చులు పోనూ మంచి ఆదాయమే మిగులుతోందని వివరించారు. నీటి వసతి ఉన్నవారు అరటి తోటలు సాగు చేయవచ్చని తన అనుభవంతో చెప్పారు.

రైతేరాజు

అధిక వర్షాలు.. అప్రమత్తత అవసరం

గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఉద్యాన పంటల్లో నీరు నిలిచి సమస్య నెలకొంది. ఈ తరుణంలో కొద్దిపాటి జాగ్రత్తలు పాటించడం ద్వారా ఆయా పంటలను రక్షించుకోవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్ తెలిపారు.


దెబ్బతిన్న మిరప పైరును పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారిణి

మిరప: ఉరకెత్తిన పొలాల్లో మొక్కలు తేరుకునేందుకు లీటరు నీటికి పది గ్రాములు చొప్పున యూరియా, పంచదార కలిపిన ద్రావణాన్ని వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. మొక్కలు వడబడి, తలలు వాల్చితే లీటరు నీటికి అయిదు గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని చల్లాలి.

◗ కాపుతో ఉండి, వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి... మొదళ్ల చుట్టూ మట్టిని ఎగదోయాలి. నేల ఆరిన వెంటనే గొర్రువేసి అంతర కృషి చేస్తే తడి ఆరిపోతుంది. పైపాటుగా ఎకరానికి 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్, 200 కిలోల వేప పిండి వేయాలి. మొక్కలు తేరుకున్నాక స్థూల, సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని ఒక దాని తర్వాత ఒకటి వారం రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడు సార్లు వేయాలి.

వేరుకుళ్లు ఆశిస్తే పది లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 10 గ్రాముల కార్బండిజమ్ కలిపి మొక్కల మొదళ్లలో పోయాలి.

కూరగాయలు: పడిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదళ్ల వద్ద మట్టిని ఎగదోయాలి. సరిపడా ఆకులు, కొమ్మలతో ఉంటే 0.3 శాతం 13-0-45 మందు (నీటిలో కరిగే ఎరువు మల్టీ-కె) లేదా రెండు శాతం యూరియా ద్రావణాన్ని... వారం రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడు సార్లు మొక్క తడిచేలా పిచికారీ చేయాలి. కొత్తగా విత్తిన లేదా నాటిన మొక్కలైతే పూర్తిగా తొలగించి మళ్లీ నాటుకోవాలి.

పూల తోటలు: మొక్కలపై 2 శాతం యూరియా లేదా 1 శాతం 13-0-45 (నీటిలో కిరిగే ఎరువు మల్టీ-కె)ను వారం రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడు సార్లు పిచికారీ చేయాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు లీటరు నీటికి 1 మి.లీ. ప్రొపికొనజోల్ కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు వేయాలి. - న్యూస్‌టుడే, కంభం

పొగాకు నారుమళ్లు... జాగ్రత్తలు తప్పనిసరి



ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పొగాకు నారు మళ్లు సాగుచేసే రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పొదిలి వేలం కేంద్రం నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్ తెలిపారు. మడుల్లో నీరు నిల్వ లేకుండా బయటకు తోడించాలని సూచించారు. నారుమడిపై ఏర్పాటుచేసిన గ్రీన్‌టెక్‌లు తొలగించి గాలి తగిలేలా చూడాలి. అధిక వర్షపాతం, తేమ, మబ్బు వాతావరణం నేపథ్యంలో మాగుడు, మానుమచ్చ, ఆకుమచ్చ తెగుళ్లు, లద్దెపురుగు ఆశించే ఆస్కారముంది. 30 రోజుల్లోపు మళ్లలో తెగుళ్లు తీవ్రంగా ఉంటే... పది లీటర్ల నీటికి 20 గ్రాముల బైటాక్స్, ఒక గ్రాము ప్లాంటామైసిన్ కలిపి పిచికారీ చేయాలి. 30 రోజులు దాటిన మళ్లలో తెగుళ్ల నివారణకు... పది లీటర్ల నీటికి అయిదు మి.లీ. అజాక్సీస్ట్రోబిన్ (అమిస్టార్) కలిపి చల్లాలి. లద్దెపురుగు ఎక్కువగా ఉంటే... పది లీటర్ల నీటికి అయిదు గ్రాముల ఇమామిక్టిన్ బెంజోయేట్ కలిపి పిచికారీ చేయాలని వివరించారు. - న్యూస్‌టుడే, పొదిలి

సమస్య • పరిష్కారం

◗ **సమస్య:** కొద్ది రోజులుగా మా దూడ తెల్లగా పారుతోంది. నివారణ ఎలా?

– శ్రీను, బొందలపాడు

సమాధానం: మోతాదుకు మించి పాలు తాగిస్తే అజీర్తి చేసి సమస్య తలెత్తుతుంది. ఈ కొలై అనే క్రిమి కూడా కారణం కావచ్చు. పాల మోతాదు తగ్గించి... గోరువెచ్చని నీటిలో యాంటీబయాటిక్ పొడి కలిపి తాగించాలి. నీటిలో గ్లూకోజ్, ఉప్పు కలిపి ఇచ్చినా సరిపోతుంది. నట్టల నివారణ మందు తాగించాలి.

◗ **సమస్య:** మా మందలోని కొన్ని గొర్రెలు కంటుతున్నాయి. ఏం చేయాలి?

- పాపయ్య, కొట్టాలపల్లె

సమాధానం: తడి ఎక్కువగా ఉన్న నేలల్లో నడిపించడం వల్ల గిట్టల మధ్య చర్మం తెల్లగా పాచి సమస్య తలెత్తవచ్చు. కొన్నిసార్లు పుండ్లు పడి చీము సైతం కారుతుంది. పది శాతం జింక్ సల్ఫేట్ లేదా కాపర్ సల్ఫేట్ లేదా ఫార్మాలిన్‌తో కాళ్లు కడగాలి. పశు వైద్యులను సంప్రదిస్తే తీవ్రతను బట్టి మందులు సూచిస్తారు.

– న్యూస్‌టుడే, మార్కాపురం


లీనాగ్రేస్, పశువైద్యురాలు, కొండేపల్లి


త్వరలో ఎన్టీఆర్ కళాపరిషత్ ఉత్సవాలు నిర్వహిస్తాం

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: ఒంగోలు నగరంలో గత అయిదేళ్లు రాజకీయ కారణాల రీత్యా ఎన్టీఆర్ కళాపరిషత్‌ను నిర్వహించకలేకపోయామని... అందుకు చింతిస్తున్నామని ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు పేర్కొన్నారు. స్థానిక కర్నూలు రోడ్డులోని మౌర్య హోటల్లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. కళా పరిషత్తు ఏర్పాటు చేసి పాతిక వసంతాలు పూర్తయిన సందర్భంగా వచ్చే ఏడాది జనవరి 18 నుంచి 31 వరకు ఎన్టీఆర్ కళా పరిషత్తు 25వ జాతీయ నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ నలుమూలల నుంచి అన్ని కళారూపాలకు ఆహ్వానం పలుకుతున్నామని.. కళాసంస్థలు నవంబర్ 30వ తేదీలోపు దరఖాస్తులు పంపాలని కోరారు. ఈ సంవత్సరం నుంచి వీడియో స్క్రూటినీ ద్వారానే నాటక కళారూపాలను ఎంపిక చేయనున్నట్లు వివరించారు. ఎంపికైన కళారూపాల సమాచారం ఆయా సంస్థలకు డిసెంబర్ 15 లోపు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ కార్యదర్శి అన్నమనేని ప్రసాదరావు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.


మార్గదర్శక పత్రాలను విడుదల చేసిన సంస్థ అధ్యక్షుడు ఈదర హరిబాబు

దస్త్రాల్లో నమోదే పరిష్కారం కాదు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: 'మీ కోసం'లో వచ్చే అర్జీల పరిష్కారం పట్ల నిర్లక్ష్యం తగదని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను హెచ్చరించారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన 'మీ కోసం'లో 249 అర్జీలొచ్చాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మొక్కుబడి సమాధానాలతో అర్జీదారులకు ఎండార్స్‌మెంట్ ఇచ్చేసి సమస్యను పరిష్కరించినట్లు దస్త్రాల్లో చూపితే సహించబోమన్నారు. క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారం కావాల్సిందేనని, లేకుంటే అందుకు కారణాలను కూడా అర్జీదారులకు వివరించాలని సూచించారు. ప్రతి సోమవారం ఉదయం 9.55 గంటలకల్లా అధికారులందరూ హాజరుకావాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో శ్రీలత, ఎస్‌డీసీలు మాధురి, ఝాన్సీలక్ష్మి తోపాటు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


ఇబ్బందులు తెలుసుకుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

బాధితులకు సత్వర న్యాయం


ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలపై సత్వరం స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి హాజరయ్యారు. ఇటీవల కాలంలో ఆన్‌లైన్, ప్రాంక్‌కాల్ మోసాలు పెరిగాయనీ, వాటిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 69 మంది తమ సమస్యలపై ఎస్పీకి వినతిపత్రాలు అందజేశారు. వీటిని చట్టపరిధికి లోబడి పరిష్కరిస్తామని ఎస్పీ దామోదర్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దిశ, డీటీసీ, ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్‌స్పెక్టర్లు సుధాకర్, షమీముల్లా, సుబ్బారావు, గ్రీవెన్స్ సెల్ ఎస్సై రజియా సుల్తానా బేగం తదితరులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ దామోదర్

ఇజ్రాయిల్ పంపిస్తానంటూ మోసం

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉపాధి కోసం ఇజ్రాయిల్ పంపిస్తానని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం కొమరగిరిపట్నానికి చెందిన పాస్టర్ ఆకుల షాలెంరాజు డబ్బులు తీసుకుని మోసం చేశారని బాధితులు వాపోయారు. సోమవారం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఒక్కొక్కరి నుంచి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేశాడరన్నారు. తర్వాత కాలయాపన చేస్తుండటంతో గట్టిగా నిలదీయగా టూరిస్టు వీసాపై జోర్డాన్ తీసుకు వెళ్లి 15 రోజుల తర్వాత హైదరాబాద్ తీసుకువచ్చి వదిలేశాడని వాపోయారు. తామిచ్చిన సొమ్ము ఇవ్వాలని అడిగితే తిరిగి బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. బాధితుల్లో అమలాపురం, రావులపాలెం, రాజోలు, పి.గన్నవరం, అంతర్వేది, పాలకొల్లు, ఒంగోలు ప్రాంతాలకు చెందిన 33 మందికిపైగా ఉన్నట్లు వారు తెలిపారు. అనంతరం ఆకుల షాలెంరాజు, ఆయన భార్యపై అల్లవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై హరీష్‌కుమార్‌ను వివరణ కోరగా ఫిర్యాదు తీసుకుని విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

డీజీపేట కేసు ఛేదనకు నాలుగు బృందాలు


సంఘటనా స్థలంలో జాగిలం బృందం, సీఐ భీమానాయక్, ఎస్సై సుమన్

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: కలకలం రేపిన డీజీపేట హత్య కేసు నిందితులను పట్టుకునేందుకు నాలుగు పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు పామూరు సీఐ ఎం.భీమానాయక్ చెప్పారు. ఆదివారం స్థానికురాలు రత్తమ్మ పొలంలో గడ్డి కోసం వెళ్లిన సమయంలో దుండగులు హత్య చేసి ఆమె వద్ద ఉన్న బంగారం తీసుకుని పరారయ్యారు. ఈ మేరకు సోమవారం సంఘటనా స్థలాన్ని సీఐ భీమానాయక్, ఎస్సై ఆర్.సుమన్ పరిశీలించారు. జాగిలం బృందం, ఆధారాల సేకరణ సభ్యులు ఆధారాలను సేకరించారు. దోచుకున్న బంగారం విలువ రూ.1.20 లక్షలుంటుందని వివరించారు. శవ పంచనామా పూర్తిచేసి పోస్టుమార్టానికి కనిగిరి ప్రభుత్వ సామాజిక వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. హత్య చేసింది స్థానికులా లేదా బయటి వ్యక్తులా అనే కోణంలో విచారిస్తున్నారు. మెడలో ఉన్న ఆభరణాలు చోరీ చేసిన ఘటనలు గతంలో స్థానికంగా చోటు చేసుకున్నాయి.. అయితే హత్యచేసి బంగారు ఆభరణాలు దోచుకున్నవి జరగకపోవడంతో స్థానికులు భీతిల్లుతున్నారు.

ముగ్గురి ఉసురుతీసిన అజాగ్రత్త

◗ వేర్వేరుచోట్ల జారిపడి ఇద్దరు..
◗ విద్యుదాఘాతంతో మరొకరి మృతి

మద్దిపాడు, న్యూస్‌టుడే: చిరు అజాగ్రత్త ముగ్గురి ప్రాణాలు హరించింది. వేర్వేరు చోట్ల కాలుజారి పడి ఇద్దరు మృతిచెందగా, విద్యుదాఘాతం మరొకరి ప్రాణాలు హరించింది. ఈ విషాద సంఘటనలు మద్దిపాడు, చీమకుర్తి, పోలీస్ స్టేషన్ల పరిధిలో చోటు చేసుకున్నాయి. పోలీసుల కథనం ప్రకారం..దొడ్డవరప్పాడుకు చెందిన గడ్డం శ్రీకాంత్ (42) వ్యవసాయ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. అయ్యప్ప స్వామి మాల వేసుకునే ఆలోచనలో ఉన్న శ్రీకాంత్ సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. మధ్యాహ్నం అయినా రాకపోయేసరికి ఆందోళన చెందిన కుటుంబసభ్యులు వెతుకుతుండగా స్థానికంగా ఉన్న చెరువులో ఆయన మృతదేహం కన్పించింది. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాలు జారి చెరువులో పడి మృతి చెంది ఉంటారని ఎస్సై శివరామయ్య చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మృతునికి భార్య శ్రీలత, కుమారుడు సాహిత్ ఉన్నారు.


శ్రీకాంత్ మృతదేహం

చీమకుర్తిలో కార్మికుడు...

చీమకుర్తి, న్యూస్‌టుడే: మురుగు కాలువలో పడి ఓ కార్మికుడు మృతి చెందారు. చీమకుర్తి పట్టణంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నంలోని గాజువాకకు చెందిన పీరు(47) గత పదేళ్లుగా చీమకుర్తిలో ఉంటూ... వివిధ క్వారీల్లో జాకీ కార్మికుడిగా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం... ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం ఎదురుగా ఉన్న ఉన్న మురుగు కాలువలో విగతజీవిగా పడి ఉన్న ఆయనను స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. ఆదివారం రాత్రి... కాలువలో పడిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ ఎం.సుబ్బారావు తెలిపారు.

విద్యుదాఘాతంతో..

చీమకుర్తి: నేల మీద పడివున్న విద్యుత్తు తీగ తగిలి ఓ రైతు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన సోమవారం చీమకుర్తి మండలం తొర్రగుడిపాడు పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మంచికలపాడుకు చెందిన కోరా సుబ్బారావు(39) తొర్రగుడిపాడు పొలాల్లో ఉన్న విద్యుత్తు మోటారు వేసేందుకు వెళ్లారు. ఆ సమయంలో మోటారుకు సమీపంలోని గడ్డిలో పడివున్న విద్యుత్తు తీగలను ఆయన గమనించలేదు. అక్కడ కాలువేసి స్విచ్ వేసేందుకు ప్రయత్నిస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందారు. కుటుంబ పెద్ద మృతిచెందడంతో భార్య, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. సుబ్బారావు భార్య సుమాంజలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎం.సుబ్బారావు తెలిపారు. మృతిచెందిన రైతు కుటుంబానికి పరిహారం అందజేసి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు, బెజవాడ శ్రీనివాసరావు, చిన్నపురెడ్డిలు ఓ ప్రకటనలో కోరారు.


సుబ్బారావు (పాత చిత్రం)

అడ్డు తొలగించుకునేందుకే హత్య

◗ ఊళ్లపాలెం కేసులో నిందితుడి అరెస్టు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: నాలుగు రోజుల క్రితం ఊళ్లపాలెంలో భార్య గొంతు కోసి హత్య చేసిన సంఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి సోమవారం న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. దీనికి సంబంధించి సీఐ హజరత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం..ఊళ్లపాలేనికి చెందిన పుట్టా వెంకట్రావు, తిరుపతమ్మ దంపతులు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. భార్యాభర్తలు పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. ఏడాది నుంచి నిందితుడు మద్యానికి బానిసై గ్రామంలో మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. దీంతో తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో భార్య అడ్డు తొలగించుకోవాలని భావించి గత గురువారం మద్యం తాగి ఇంటికి వెళ్లి ఆమెపై దాడికి దిగాడు. తిరుపతమ్మ తన వద్ద ఉన్న కర్రతో అడ్డగించబోగా, వెంకట్రావు ఇంట్లో ఉన్న కత్తి తీసుకుని ఆమె గొంతుకోసి పరారయ్యాడు. సోమవారం ఉదయం నిందితుడు స్థానిక కందుకూరు వంతెన వద్ద ఉండగా, సిబ్బందితో వెళ్లి అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టగా రిమాండ్ విధించారు.

మనస్తాపంతో బాలిక ఆత్మహత్య

మార్కాపురం, న్యూస్‌టుడే: మనస్తాపంతో ఓ బాలిక ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మార్కాపురం పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు గొట్టిపడియకు చెందిన కొండేపోగు సువర్ణ- మరియదాసు దంపతులు. మనస్పర్థలతో వారు విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. ఆరు నెలల కిందట తల్లి సువర్ణ, కుమార్తె అరుణ (16) కలిసి గొట్టిపడియ నుంచి మార్కాపురంలోని ఎస్సీ, బీసీకాలనీకి వచ్చి అద్దెకుంటున్నారు. గత కొంతకాలంగా వేదన చెందుతున్న అరుణ ఆరోగ్యం క్షీణించింది. దీంతో ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. గమనించిన తల్లి మార్కాపురం సర్వజన వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మార్కాపురం పట్టణ ఎస్సై ఎం. సైదుబాబు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 530 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 133, రిటైల్ లైవ్ - 155, చికెన్ విత్ స్కిన్ - 225, చికెన్ స్కిన్‌లెస్- 256

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలుచేసే ప్రకటన కర్త ను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.